ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

Entered
శ్రీకాకుళం

స్నేహ

ఆగస్టు 13, 2006

స్ట్రెస్

నగర జీవితపు నరకయాతన

హ్యాపీ బర్త్‌డే

(13.8.2006 నుంచి 19.8.2006వరకు)

సిహెచ్. వరుణ్
4సం॥, ఆగస్టు-13
రాణి-మహేష్
కామాటివీధి-నెల్లూరు

ఎం. హార్షిత
2సం॥, ఆగస్టు-13
అరుణ-వెంకట్రావు
పెదరావూరు-గుంటూరు

అభిషేక్(బన్ని)
1సం॥, ఆగస్టు-14
లావణ్య(రజిత)-దర్శన్
దండుమైలారం-రంగారెడ్డి

అస్మిత
1సం॥, ఆగస్టు-15
ప్రగతి-రామిరెడ్డి
జానకిరామనగర్-అనంతపురం

వి. అజయ్‌కుమార్
ఆగస్టు-14
రమణజీ-అప్పారావు
అచ్చుతపురం-విశాఖపట్నం

జి. ప్రదీప్
1సం॥, ఆగస్టు-15
వెంకటమ్మ-కుమార్
వనపర్తి-మ॥నగర్

ఎం. కౌసల్యారాణి
9సం॥, ఆగస్టు-16
పద్మకుమారి-సోమనాథ్‌బాబు
కృష్ణలంక-విజయవాడ

బి. ఆకాష్
2సం॥, ఆగస్టు-18
భారతి-అప్పలనాయుడు
డోలపేట-శ్రీకాకుళం

వై. అభిషేక్‌కుమార్
3సం॥, ఆగస్టు-19
సుజాత-రత్నం
రామరాజుపల్లె-కడప

జెమిలా
2సం॥, ఆగస్టు-2004
రెహమత్-రియాజ్
రాణిగారితోట-విజయవాడ

యస్. యశోధర
5సం॥, ఆగస్టు-2001
జయమ్మ-వెంకటరమణ
ముదిగుబ్బ-అనంతపురం

హిమకర్
5సం॥, ఆగస్టు-2001
పద్మ-కమలాకర్
అశోక్‌నగర్-హైదరాబాద్

జి. కావేరి
శ్యామల-శ్రీనివాసరావు
పతివాడపాలెం-శ్రీకాకుళం

కె. సిస్సి
8సం॥, ఆగస్టు-1998
సరిత-సాధర్
చింతారెడ్డిపాళెం-నెల్లూరు

జి. సుకీర్తా
1సం॥, ఆగస్టు-2005
సుశీల-రవి
వనపర్తి-మ॥నగర్

డబ్బుతోపాటే వైరుధ్యాలు పెరుగుతాయి

మన అతిథి గురించి...

పేరు	:	చుక్కపల్లి పిచ్చయ్య
జననం	:	ఏడు ఆగస్టు , 1928
ఊరు	:	కంచర్లపాలెం, తెనాలి మండలం, గుంటూరు జిల్లా
చదువు	:	ఐదవ తరగతి
కుటుంబం	:	వ్యవసాయ కుటుంబం
వృత్తి	:	చెప్పల తయారీ పరిశ్రమ (పాపులర్ షూమార్ట్)
ప్రవృత్తి	:	బాధితులకు ఆపన్న హస్తం అందచేయడం. ఎక్కడ ప్రజలకు కష్టం వచ్చినా వారిని ఆదుకోవడం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు బాధితులకు వివిధ రూపాలలో పాపులర్ షూమార్ట్ గ్రూపు సంస్థల ట్రస్ట్ ద్వారా సేవలు అందించడం.
లక్ష్యం	:	ఇతరుల శక్తిని, ఆర్థిక స్థితిని ఉపయోగించుకుని రెంటినీ వాడుకుని వారిని అభివృద్ధి పరుస్తూ మనం అభివృద్ధి చెందాలన్న లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకు సాగారు.
అవార్డులు	:	సర్వీస్ ఫర్ వరల్డ్ పీస్ గోల్డ్‌మెడల్ , సేల్స్ ప్రమోషన్ ఫర్ ఉద్యోగపాత్ర అవార్డు, లోకశ్రీ అవార్డు, విజయశ్రీ అవార్డు
రచనలు	:	ప్రథమ సోషలిస్టు దేశంలో పర్యటన , పరిశీలన - ఇది హిందీ, ఇంగ్లీషు, తమిళ.బెంగాలీ బాషలలోకి అనువదించారు.

డబ్బు పెరుగుతున్న కొద్దీ వైరుధ్యాలు పెరుగుతున్నాయన్న విషయం నాకర్థం అయ్యింది. డబ్బు సంపాదించక ముందు అందరూ బాగానే ఉంటారు. డబ్బు సంపాదన పెరుగుతున్న కొద్దీ వారి అవసరాలు పెరుగుతాయి. దీంతో పాటు ఆర్థిక అవసరాలు, వైరుద్యాలు పెరుగుతూ వస్తున్నాయి. మనుషుల మధ్య మానసిక దూరమూ పెరుగుతోంది. డబ్బు రానివారిలో ఈ పరిస్థితి లేదు. డబ్బు సంపాదించిన వారిలోనే వైరుధ్యాలు పెరిగాయి. డబ్బుతోటి ప్రయాణం అనేది తప్పనిసరి వైరుధ్యాలను తెస్తుందని నా నమ్మకం.

చుక్కపల్లి పిచ్చయ్య

ఈ సంచికలో...

టపా	...	2
టర్నింగ్ పాయింట్	...	4
సలహాలు	...	5
ఇంటి సంగతులు	...	6
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
మనమూ మన నమ్మకాలు	...	20

ఇంకా...

ఇలా వుందామా... 7

పులిని చూసి...

సీరియల్ 8

తెలుగుగడ్డ

కథ 18

విత్తనం

ఆరోగ్యం	...	17
టీ బ్రేక్	...	21
మనసా... తెలుసా	...	22
విజ్ఞానవీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24



ఇంగ్లీషు

జూలై 30వ తేదీ స్నేహ సంచికలో వచ్చిన అట్టమీది కథ 'అంతా ఆంగ్లమ(మా)యం' ప్రపంచీకరణ పరిణామాలను తెలియజేసింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీషు భాష ఓ అవసరంగా మారిందన్నది జగమెరిగిన సత్యం. సబ్జెక్టుపై అవగాహన ఉన్నంతలో సరిపోదు, ఇవాళ ఇంగ్లీషులో మాట్లాడడం కచ్చితంగా అవసరం. ఒకవేళ మాట్లాడలేకపోతే వారు కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగం వస్తుందన్న ఆశ వదులుకోవాల్సిందే. ఆరోగ్యం శీర్షికలో 'ఆలోచించగలిగితే' బాగుంది. తెలుగుగడ్డ సీరియల్ చాలా ఆసక్తికరంగా ఉంటోంది.

హేమలత, తిరుపతి

అలరిస్తున్నాయి

టర్నింగ్ పాయింట్‌లో 'భార్యకోసం బాండ్ ఎయిడ్ తయారీ' చాలా బాగుంది. న్యాయసలహాలు ఉపయోగకరంగా ఉంటున్నాయి. కార్టూన్లు బాగా నవ్వు తెప్పిస్తూ అలరిస్తున్నాయి.

రాజేష్, అదిలాబాద్

భలే...

ఇంటిసంగతులు శీర్షికలో 'పెద్దరికం' ప్రస్తుత సమాజపు తీరుకు అద్దంపట్టింది. అలాగే నిజాయితీకి కులంతో పనిలేదనే విషయాన్ని చాటిచెప్పింది. కార్టున్లు బాగుంటున్నాయి. హ్యాపీ బర్త్‌డే పేజీ భలే కలర్‌ఫుల్‌గా ఉంది.

మధు, రామంతపూర్

వానరాకడ

మనమూ - మననమ్మకాలు శీర్షికలో 'వానరాకడ' ప్రజల మూఢనమ్మకాలను తెలియజేసింది. పల్లెటూర్లలో ఇప్పటికీ వర్షం కురవకపోతే వనభోజనాలకు వెళతారు. మరి కొందరు వేప, రావిచెట్లకు పెళ్లిళ్లు చేస్తారు. కొన్ని సందర్భాల్లో యాదృచ్ఛికంగా వర్షం కురిస్తే అది వారి పూజల ఫలితమేనని చాటి చెప్పుకుంటారు. ఇలాంటి మూఢనమ్మకాలు నేటికీ ప్రజలు కలిగి ఉండడం శోచనీయం.

దివ్య, భవానీ నగర్, తిరుపతి.

స్ఫూర్తి

తెలుగుగడ్డ సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. సినిమా కబుర్లు ద్వారా రంగనాథ్ చెబుతున్న విషయాలు ఆసక్తికరంగా వున్నాయి. ఆయన ఒంటరితనాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం, జీవితలక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో ఆ ఆలోచననుండి బయటపడడం చాలా స్ఫూర్తినిచ్చింది. సెంటర్ స్ప్రెడ్ బాగుంది.

కె. కేశవ్, కడప

కొనసాగించండి...

పదేళ్ల వయసుగల చిన్నారులందరికీ స్నేహ ద్వారా హ్యాపీ బర్త్‌డే శుభాకాంక్షలు ఉచితంగా తెలియజేస్తున్నందుకు మీకు ప్రత్యేక అభినందనలు. కలం స్నేహం ద్వారా పిల్లల గురించి, వారి ఇష్టాయిష్టాలు, వారి లక్ష్యాలు ప్రజాశక్తి ద్వారా తెలియజేస్తున్నారు. ఇందుకు సంతోషం. ఈ మధ్యకాలంలో కొంతమంది వారి అభిప్రాయాలను (టపాద్వారా) తెలియజేస్తూ, ఉచితంగా ప్రచురించే ఈ శీర్షికలో వచ్చే ఫొటో, వివరాలను అసలు వ్యక్తులు మాత్రమే చూస్తున్నారు. మిగిలినవారు చూడడం లేదు అన్నారు. ఈ వాదన చాలా తప్పు. మా పిల్లలు, ఇంకా మా బంధువులు, స్నేహితుల పిల్లల ఫోటోలు పై శీర్షికల్లో అచ్చయి వచ్చినప్పుడు మేం శుభాకాంక్షలు చెప్పుకుంటాం. అలా మేం చెప్పుకున్నప్పటికీ అవి స్నేహకు చెందుతాయి. ఇందులో ఏమాత్రమూ సందేహం లేదు. ఈ శీర్షికలను తొలగించకుండా తప్పనిసరిగా కొనసాగించాలని కోరుతూ...

చింతలచెర్వు శంకరరావు, బోనకల్లు, ఖమ్మం

వ్యసనం

'సమీక్షణం'లో నాటకాలు డైలాగుల సంతలు కారాదు బాగుంది. డైలాగుల డ్రామాలు ఒక వ్యసనంలా దాపురించాయనడం సమంజసమే. అట్టమీది కథ 'అంతా ఆంగ్లమ(మా)యం' ప్రపంచీకరణ పరిణామాలను తెలియజేసింది. 'మనసా తెలుసా' శీర్షిక చాలా ఉపయోగకరంగా ఉంటోంది. కవర్‌పేజీ చాలా ఆకర్షణీయంగా ఉంది.

విజయ లక్ష్మి, రాజేంద్ర నగర్

అభివృద్ధి

మనసాతెలుసా' చాలా ఉపయోగకరంగా ఉంది. దీన్ని చదివి మేం మా పర్సనాలిటీని అభివృద్ధి చేసుకోగలుగుతున్నాం. 'అవీ...ఇవీ' శీర్షికలో 'ఓరే తమ్ముడూ' కవిత కంటతడి పెట్టించింది. పుస్తక పరిచయం ద్వారా కొత్త కొత్త పుస్తకాలను పరిచయం చేస్తున్నారు. రుచిలో అందించే వంటకాలు బాగున్నాయి.

లక్ష్మి, బాలాజీ కాలని, తిరుపతి.

అభిరుచి

'రుచి'లో మీరందిస్తున్న వంటలన్నీ బాగుంటున్నాయి. 'కలంస్నేహం' ద్వారా ఉత్తరాలు రాసే అభిరుచిని ప్రోత్సహిస్తున్నారు. 'కవర్ పేజీ' చాలా బాగుంది. 'హాపీ బర్త్‌డే' శీర్షిక ద్వారా పిల్లలకు ఉచితంగా పుట్టినరోజు శుభాకాంక్షలందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

శిరీష, తెనాలి.

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

3730

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

రుక్మిణి

అనుకోకుండా ఆవిష్కృతమైన ఆయుధం

అనుకోకుండా వీళ్లకు పెన్సిలిన్ శాంపిల్సు లభించాయి. అవి రూపాంతరం చెందకుండా అడ్డుకోవడంలో వీరు కృతకృత్యులయ్యారు. వాటిని వాడినపుడు అది శరీరంలో జీవకణాలకు ఎలాంటి హానీ చేయబోదని నిర్ధారించారు.

గాయాలు మానకపోవడం, చీముపట్టడం, జీవకణాలు కుళ్లి, వ్రణాలు పెద్దవవడం, అంటువ్యాధులు ప్రబలడం ఆ రోజుల్లో చాలా ఎక్కువ. మందులసలు దొరికేవే కావు. వివిధ రకాల బాక్టీరియాలవల్ల రకరకాల విషజ్వరాలు, అంటువ్యాధులు... ఒకటేమిటి, ఇందులో ఏది వచ్చినా ఎలాంటి మందులూ లేని రోజుల్లో మనిషికి మరణమే శరణ్యమయ్యేది.

1981 ఆగస్టు 6న అలెగ్జాండరు ఫ్లెమింగ్ ఆర్‌హైర్, స్కాట్లండ్‌లో జన్మించాడు. తండ్రి వ్యవసాయదారుడు. మొదట అదే ఊరిలో వున్న బడిలో చదువుకున్నాడు. తర్వాత కిల్మన్‌రాక్ అకాడెమీలో చేరాడు. 13వ ఏట తండ్రి మరణించాడు. పెద్దన్నయ్య లండన్‌లో మెడికల్ ప్రాక్టీషనర్. అతని దగ్గరికెళ్లి మూడేళ్లపాటు అక్కడ రిజెంట్ స్ట్రీట్‌లోని పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్‌లో చదువుకున్నాడు. మేరీస్ మెడికల్ స్కూల్లో చేరడానికి ముందు నాలుగు సంవత్సరాలు షిప్పింగ్ ఆఫీసులో గడిపాడు. 1906లో మెడిసిన్‌లో అత్యున్నత మెరిట్‌తో ఉత్తీర్ణుడయ్యాడు. 'వాక్సిన్ల'లో ప్రవీణుడైన ఆల్మత్‌రైట్‌గారి ఆధ్వర్యంలో పరిశోధన సాగించాడు. 1908లో లండన్‌లో ఎం.బి.బి.ఎస్.లో బంగారు పతకాన్ని సాధించాడు. 1914 వరకు సెయింట్ మేరీస్‌లో లెక్చరర్‌గా పనిచేశాడు. మొదటి ప్రపంచయుద్ధంలో 'రాయల్ మెడికల్ కార్ప్స్'లో కెప్టెన్‌గా పనిచేసి, 1918లో తిరిగి సెయింట్ మేరీస్‌కు వచ్చిచేరాడు. 1928లో ఆ స్కూలుకు ప్రొఫెసరుగా ఎంపికయ్యాడు. 1943లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ దొరికింది. తర్వాతి కాలంలో అతని గౌరవార్థం ఏర్పాటుచేసిన 'ఫ్లెమింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రోబయాలజీ'కి ప్రిన్సిపాల్‌గా వుండిపోయాడు.

ఇవన్నీ ఒక ఎత్తు. ఇక అసలు విషయానికి వస్తే 1928లో...

'స్టెఫలక్షకూకై' అనే రోగకారక బాక్టీరియాపై ఆయన పరిశోధనలు చేస్తున్నాడు. బాక్టీరియాను గాజుపాత్రలో వుంచి వెళ్లాడు. తర్వాత వచ్చి చూస్తే ఆ బాక్టీరియాకు కాస్త బూజుపట్టి, అది రోగగ్రస్తమైంది. ఆ బూజు ఉన్న పరిధిలోని రోగకారక స్టఫిలోకొక కాస్తా కనపడకుండా అదృశ్యమైపోయింది. ఫ్లమింగ్ వెంటనే బూజు నుండి యాంటీబాక్టీరియల్ పదార్థం విడుదలైందనీ, దానివల్లనే ఆ బాక్టీరియా నాశనం అయిందనీ నిర్ధారించాడు.

ఆ బూజు (ఫంగస్)ను వేరుచేశాడు. ఆహారపు పులుసులో ఉంచాడు. దాన్లో అది బాగా విస్తరించింది. కొద్దిరోజుల తర్వాత ఆ బూజు కలిసిన పదార్థం చాలా బలమైన బాక్టీరియా వ్యతిరేక లక్షణాలను సంతరించుకుంటోందని కనిపెట్టాడు. అమితమైన యాంటీబాక్టీరియా ఆ బూజుద్రవంలో ఎన్నోరకాల రోగకారక బాక్టీరియాను చాకచక్యంగా నిర్మూలించగలనని అర్థంచేసుకున్నాడు. అంతేగాక అది తెల్లరక్తకణాలకు ఎలాంటి హానీ కలగజేయదనీ తేల్చాడు.

ఇంతకీ ఫ్లెమింగు దొరకబుచ్చుకున్న ఆ మందు ఫంగస్ జాతికి చెందిన పెన్సీలియం పెక్టినీటం. చూడ్డానికి సన్నగా, నారపోగుల్లా ఉంటుంది. కాబట్టి 'పెన్సీలియం' బూజు స్రవించిన ఆ పదార్థానికి 'పెన్సిలిన్' అని నామకరణం చేశాడు.

తర్వాత కావల్సినంత పరిమాణంలో పెన్సిలిన్‌ను ఆ పులుసు నుండి శుభ్రంగా బయటికి తీశాడు. చాలా కష్టంతో కూడుకున్న పనిది. ఎందుకంటే అది స్థిరంగా ఉండదు. అంతేగాక అక్కడ ఎలాంటి సాంకేతిక సౌకర్యాలూ ఉండవు.

అలా పది సంవత్సరాలు గడిచిపోయాయి.

మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. సైనికులకు గాయాలు, పుళ్లు, అంటురోగాలు. శాస్త్రజ్ఞులకూ, వైద్యులకూ పెద్ద సమస్యే అయింది. హోనర్డ్‌ఫ్లోర్ అనే ఆస్ట్రేలియాకు చెందిన జీవరసాయన శాస్త్రజ్ఞుడు, చైనే అనే మరో మైక్రోబయాలజిస్టు (జర్మనీ) ఈ భాధ్యతను చేపట్టారు. వాళ్లు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. అనుకోకుండా వీళ్లకు పెన్సిలిన్ శాంపిల్సు లభించాయి. అవి రూపాంతరం చెందకుండా అడ్డుకోవడంలో వీరు కృతకృత్యులయ్యారు. వాటిని వాడినపుడు అది శరీరంలో జీవకణాలకు ఎలాంటి హానీ చేయబోదని నిర్ధారించారు. అయితే ఆ పెన్సిలిను మందు క్రమం తప్పకుండా చాలా రోజులు వాడాల్సి వుంటుంది. ఎందుకంటే శరీరం దాన్ని తరచుగా బయటికి విసర్జించిపారేస్తూ ఉంటుంది.

ప్రస్తుతం పెన్సిలిన్ మానవాళికి మహోపకారం చేస్తున్న ఔషధం. దాదాపు చాలా రకాల బాక్టీరియావల్ల వచ్చే రుగ్మతలకు అది దివ్యౌషధం లాంటిది.

'నేను ఏ ప్రదేశానికి వెళ్లినా అక్కడి ప్రజలు తమ ప్రాణాలను కాపాడే ఔషధాన్ని తయారుచేసినందుకు నాకు కృతజ్ఞతలు చెప్పేవారు. వాళ్లకలా ఎందుకనిపిస్తుందో నాకైతే తెలీదు. ప్రకృతి పెన్సిలిన్‌ను సృష్టించింది. నేను కేవలం దాన్ని కనుగొన్నాను. అంతే!' అంటాడు ఫ్లెమింగ్ చాలా నిరాడంబరంగా. ఈయన గుండెపోటు వల్ల తనువు చాలించాడు.

✳

ఎటువంటి నోటీసూ ఇవ్వలేదు

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్. జి.ఎల్.నరసింహారావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు. మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, ఫ్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

మా జిల్లాలో ఎస్ఎల్‌బిసి కెనాల్‌కు గాను సబ్ కెనాల్ సహాయంతో అన్ని గ్రామాలలోని చెరువులను నింపే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఊరి చెరువుకూ కాల్వతీశారు. అదే విధంగా మా గ్రామానికీ తీశారు. మా భూమిద్వారా కాలువ తీయాల్సి వచ్చింది. ఫలితంగా ఒక ఎకరం మూడు సెంట్లు కాల్వలో కలిసిపోతుంది. ఆ కాలువతో మాకు ఎటువంటి లాభమూ లేదు. కాలువ విషయమై మాకు ఎటువంటి సమన్లు, నోటీసులూ అందలేదు. వారు మా భూమిలో కాల్వ తీసే ప్రయత్నం చేస్తున్నారు. మా గ్రామస్థులెవరూ అభ్యంతరం చెప్పలేదు. ఎవరికీ నోటీసు ఇవ్వలేదు. మేం ఏం చేయాలి. మాకు ధర కట్టిస్తారా?

వనరాజ్, నల్గొండ

కాల్వలకు, డ్యాములకు భూ సేకరణ చేయదలచినప్పుడు వెంటనే ఎస్‌పిఎల్ డిప్యూటి కలెక్టర్ గారి ద్వారా ఎవరి తాలుకు భూమిని, ఎంత మొత్తం సేకరించాలి అనేది స్పష్టంగా వివరిస్తూ నోటీసు జారీ చేస్తారు. పెద్ద మొత్తంలో చేయాల్సి వచ్చినప్పుడు, పేపర్ ప్రకటన ద్వారా భూసేకరణ చట్ట ప్రకారం సెక్షన్ 4(1) నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాక, నేరుగా భూమిని సేకరించడం తప్పవుతుంది. అత్యవసర మయినప్పుడు మాత్రమే అలా చేయవచ్చు. మీకు నోటీసు

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

ఇవ్వకుండా, ఎంత మొత్తం భూమి కోల్పోతారో తెలియజేయకుండా భూసేకరణ చేయకూడదు. మీరు సంబంధిత అధికారులపై హై కోర్టులో రిట్‌పిటిషన్ వేయండి. ఫలితంగా వారు చేపడుతున్న చర్యలను నివారించవచ్చు. వారి నోటీసు ద్వారా మీరు కొల్పోతున్న భూమిని అంచనా వేసి, దానికి సరిపడ మొత్తం ధరను మీరు కింది కోర్టులో కేసు వేయడం ద్వారా పొంద వచ్చును. ధర చెల్లించకుండా ఎటువంటి భూసే కరణా చేయరు. నామమాత్రంగానైనా మీకు ధర చెల్లించాల్సి ఉంటుంది.



ఇంతే ఇంతే..

ఇంద్రగంటి జానకీబాల

'ద్రౌపదికి ఎంతమంది భర్తలు?' ఎందుచేతనో సమాధానం కరెక్టుగా రపీమని చెప్పి మరో గ్రాము బంగారం చేజిక్కించుకున్న ఆ ఇద్దరూ సుశీలకి భలే అదృష్టవంతుల్లా కనిపించారు.



సుశీల తీరిగ్గా కూర్చుని టీవీలో వస్తోన్న తెలుగు సీరియల్ చూస్తోంది. సుమారు ఏణ్ణార్థంగా ఈ సీరియల్‌ను చూస్తూనే ఉంది. అబ్బ! ఒకటే 'సాగిలాగుడు' అని విసుక్కుంటూనే ఉంటుంది. అయినా ఏ ఒక్కరోజూ అది చూడడం మానేయలేదు. ఎప్పుడైనా "ఆ... ఏముంది? చూసేందుకు" అని విసుక్కున్నా, ఆ సమయానికి అసంకల్పితంగా టీవీ పెట్టేసుకుని చూసేస్తుంది. ఇది కూడా ఒక రకమైన వ్యసనమే. మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు కూడా... "అబ్బే! వద్దు. ఇది మంచిది కాదు" అనుకుంటారు. కానీ సమయం వచ్చేసరికి అది వేసుకోకుండా ఉండలేరు. ఇదీ అలాంటిదేనని మేథావులు భావిస్తున్నారు. వేరే ఆలోచన లేకుండా చేస్తుందిది కూడా.

సుశీల ఛానల్ మార్చింది. ఎక్కడ చూసినా బంగారం - బంగారం - బంగారం. లేకపోతే పట్టుచీరలు, నగలు. వాటిని పొందేందుకు చిన్నచిన్న క్విజ్‌లు. వాళ్లు అడిగే ప్రశ్నలు, వాటి సమాధానాలు చూస్తుంటే ప్రతివాళ్లకూ 'ఈపాటి జవాబులు చెప్పలేని వాళ్ళుంటారా?' అనిపిస్తుంది. నిజానికి చిన్నపిల్లలు సైతం కళ్ళు మూసుకుని చెప్పేంతటి తేలికైన ప్రశ్నలే వుంటాయి. కాకపోతే ఎప్పుడూ టీవీ ముందే కూర్చోవాలి. తెరమీద 'రాముడు ఎన్నేళ్లు అరణ్యవాసం చేశాడు?' అని అడుగుతోంది ఓ యాంకరమ్మ. పాపం ఎదురుగా ఉన్న ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని కూడబలుక్కుంటున్నారు. సమాధానంకోసం గిలగిల్లాడిపోతున్నారు. వారిలో ఒకరు పదమూడని ఒకరు పధ్నాలుగేమోనని భావిస్తున్నారు. చివరికి చాలా ధైర్యం చేసి పధ్నాలుగేళ్లు అంటూ జవాబిచ్చారు.

ఒక్కసారి ఆ యాంకర్ గావుకేకపెట్టింది. ఏమనీ... రైట్ ఆన్సర్ అంటూ ఆ రెండు ముఖాలూ దీపావళినాడు మెర్క్యురీ తీగెలా వెలిగాయి. వారిద్దరూ ఒక గ్రాము బంగారం గెలుచుకున్నారు. ఆ తర్వాతి ప్రశ్న వింటుంటే సుశీలకు ఆశ మరింత బలపడింది.

'ద్రౌపదికి ఎంతమంది భర్తలు?' ఎందుచేతనో సమాధానం కరెక్టుగా రపీమని చెప్పి మరో గ్రాము బంగారం చేజిక్కించుకున్న ఆ ఇద్దరూ సుశీలకి భలే అదృష్టవంతుల్లా కనిపించారు. 'తనెలా ఈ కార్యక్రమానికి వెళ్లాలా?' అని ఆలోచనలో పడిపోయిందామె. ఆ ఇద్దరూ అక్కడ కూర్చుని ముసిముసి నవ్వులు నవ్వుతూ వరుసగా ఎనిమిది గ్రాముల బంగారం గెలుచుకుని బయటపడ్డారు. ఎనిమిది గ్రాములంటే మాటలా? కాసు బంగారం.. అంటే ఎనిమిది వేలన్నమాట. అబ్బ! ఎంత అదృష్టవంతులు వాళ్లు! అయినా వీళ్లడిగే చెత్త ప్రశ్నలకు ఈజీగా సమాధానాలు చెప్పేయవచ్చు. నిజానికి ఇద్దరు అనవసరం. టీవీ వాళ్లే ఎందుకో ఇద్దరు కావాలని పెట్టారు. తనలాంటి వాళ్ల తెలివితేటల్ని వాళ్లు తక్కువ అంచనా వేస్తున్నారో ఏమో అనుకుని మరో ఛానల్ తిప్పింది సుశీల. ఆ ఛానల్లో టెలిఫోన్ మోగుతుంటే అక్కడాగింది సుశీల. అవతలి వైపు ఎవరో ఫోనెత్తి హలో అన్నారు. 'మేం పర టీవీ, 'నిలువుగుడ్లేసుకున్నారా' ప్రోగ్రామ్ నుంచి మాట్లాడుతున్నాం' అంది, కాసేపు ఇటు నుంచి, కాసేపు అటు నుంచి హలోలు అయ్యాక. 'మీరిప్పుడు పరటీవీ చూస్తున్నారా?' అని ప్రశ్న.

'చూస్తున్నామండీ' అని జవాబు.

'అయితే ఇంతక్రితం నేనేం ప్రశ్న వేసేనో దానికేం జవాబొచ్చిందో, వాళ్ళే ఊర్నుంచో చెప్పండి' గడగడా అడిగింది యాంకర్

అట్నుంచి నిశ్శబ్దం. యాంకరమ్మ ఐదారుసార్లు హల్లో, హల్లో అన్నాక మళ్లీ అట్నుంచి బలహీనంగా ఒక హల్లో.

'మీ జవాబు త్వరగా చెప్పాలండీ! మీరు కరెక్ట్ జవాబు చెప్తే మీకో అద్భుతమైన గిఫ్ట్ రెడీ. ఏదీ మేం ఇంతకు పూర్వం...' పాపం యాంకర్ మళ్లీ విషయమంతా ఓపిగ్గా చెప్పింది. అవతలివైపు నుంచి మాట్లాడుతున్న మహిళకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు కాబోలు 'మాకు కరెంటు పోయిందండి. ఇప్పుడే నేను టీవీ పెట్టాను' అంది. పైన తథాస్తు దేవతలు వున్నట్టున్నారు, మరుక్షణం కరెంటుపోయింది. 'ఫ్చ్' అని నిట్టూరుస్తూ సోఫాలోంచి లేచింది సుశీల.

ఉత్తిపుణ్యానికి ఎవరైనా బంగారమూ, పట్టుచీరలు ఇస్తారా? ఇస్తున్నారంటే ఎందుకు?' అనే ఇంగితజ్ఞానం లేకుండా అవి తనకూ రావాలని, వాటిల్లో పాల్గోవాలంటే ఏం చేయాలని అందర్లాగే తెగ ఆలోచించసాగింది సుశీల.

✻



ఇలా వుందామా...

పులిని చూసి...

వి. నాగరత్న

"ఏంటి బావా, బుజ్జి పెళ్ళికి ఎంత ఖర్చవుతుందనుకుంటున్నావు?" అడిగాడు బావమరిది రామ్మోహన్.

"పదిలక్షలౌతుంది" చెప్పాడు సుందరం.

"కట్నకానుకలతో కలిపా?"

"చాల్లేవోయ్ సంబడం.. పద్మారావునగర్ ఫ్లాటు, కూకట్‌పల్లిలో వున్న ప్లాటు - రెండూ కట్నంకింద ఇస్తున్నాను"

"వామ్మో, అంటే కేవలం పెళ్ళి ఖర్చులకే పదిలక్షలా?"

"మరేమనుకున్నావ్, నేనంటే మీ అక్కకి తేరగా దొరికాను"

"ఆ.. నువ్వు మట్టుకు ఫ్రీగా చేసుకున్నావేంటి? ఆ రోజుల్లోనే యాభైవేలు పుచ్చుకున్నావ్"

"అదో పెద్ద సామ్మా? ఏదో మీ అక్క పుణ్యం చేసుకోబట్టిగానీ, నా ఎత్తు బంగారం ఇచ్చినా దొరికేవాణ్ణి కాను"

"ఈ మాటలకేమొచ్చెలేగానీ.. బావా, పెళ్ళి సింపుల్‌గా చేస్తే పోలా?"

"మొన్న మా తోడల్లుడి కూతురి పెళ్ళికొచ్చావుగా.. ఎంత ఆర్భాటంగా చేశాడు?! ఎన్ని కూరలు, ఎన్నెన్ని స్వీట్లు, హాట్లు.. మనం కూడా ఆ లెవెల్లో చేయాలి"

"ఇది మరీ బాగుంది. తోటివాడు తొడ కోసుకుంటే మనం మెడ కోసుకోవాలా?" అన్నాడు సుందరం సోదరుడు సత్యం.

"నీకు తెలీదులేరా సత్యం. మిన్నూమన్నూ ఏకమయ్యేంత గొప్పగా చేశానని ఆయనగారెంత ఫోజుకొట్టాడో తెలుసా? అప్పోసొప్పో చేసైనా సరే అంత ఘనంగానూ చేయాలి"

"ఊరుకో బావా. ఆయన్తో పోటీకి పోయి నువ్వు అప్పుల్లో మునుగుతావా ఏంటి?"

"మీరెందుకు అర్థంచేసుకోరు? తన స్థాయిలో పెళ్ళి భోజనాలు పెట్టడం నావల్లకాదని ఇండైరెక్ట్‌గా వాగాడు. పైగా నాకూ ఒక్కగానొక్క కూతురేగా.. ఈ పెళ్ళి గ్రాండ్‌గా చేస్తే, ఇక నానీ పెళ్ళికి మనం టెన్షన్ పడాల్సిందేముంటుంది? దర్జాగా కూర్చుంటే పిల్ల తరఫువాళ్ళే అన్నీ సమకూరుస్తారు"

"ఉన్నవాడు తన గొప్పలు ప్రదర్శించుకోవాలని దాబుగా చేశాడంటే అర్థముంది. వాళ్ళలా మనమూ చేయాలనుకుంటే పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లే ఔతుంది. మన స్థాయిని మించి ఖర్చుపెట్టి, ఆనక వడ్డీలు కట్టలేక నానా అగచాట్లూ పడాలి" అన్నాడు సత్యం.

"అసలు నన్నడిగితే డబ్బుంటే మాత్రం అంత దర్పం చూపించాలా? అంతగా లెక్కకు మించిన ధనరాశులుంటే పేదవాళ్ళకి అన్నదానం చేయొచ్చుగా.. అబ్బే అలా మనసొప్పదు. డాంబికానికి పోయి ఇరవైరకాలు వడ్డించినంతలో అన్నీ తినేస్తారా? అందులో నచ్చినవేవో రెండు తిని తక్కినవన్నీ వదిలేస్తారు" చిరాగ్గా అన్నాడు రామ్మోహన్.

"మరదే అందులో వున్న ఆంతర్యం... ఎవరికి నచ్చినవి వాళ్ళు తింటారనే అన్ని రకాలకి ఆర్డరిచ్చేది" అన్నాడు సుందరం.

"గొప్ప ఉద్దేశమేలే.. శుభ్రంగా తింటే ఎవరేమనుకుంటారోనని చిలక కొరుకుళ్ళు కొరికి, కాస్తాకూస్తా నంజి తక్కినవన్నీ వదిలేస్తే ఆ ఎంగిలిస్తరాకులకోసం కొన్ని జీవులు పరుగులుపెట్టడం ఎంత కడుపు రగిలించే అంశమో చాలామందికి అర్థంకాదు" ఆర్తిగా అన్నాడు సత్యం.

'ఇద్దరూ ఒక తల్లి బిడ్డలే అయినా ఇద్దరి ఆలోచనలకూ పొత్తులేదు' అనుకున్నాడు రామ్మోహన్.

"అయితే ఏమంటావురా? పెళ్ళికొచ్చే పెద్దలకి భోజనాలు పెట్టడం మానేసి, పేదవాళ్ళకి అన్నదానం చేయమంటావా? అసలేంటి నీ ఉద్దేశం?" తమ్ముడివంక గుర్రుగా చూస్తూ అన్నాడు సుందరం.

"అంత మాట నేను అననూలేను, నువ్వూ పాటించవులేగానీ, భోజనాల ఏర్పాటుదీ డాంబికం లేకుండా చేస్తే బాగుంటుంది. కొందరైతే ప్రతిదీ ఇలా చేయాలని శిలాశాసనాల్లా జారీచేస్తున్నారు. కానీ మీ వియ్యంకుడు చాలా పద్ధతిగా, సంస్కారంగా మాట్లాడాడు కనుక నీకలాంటి తల్నొప్పులేం లేవు. అనవసరంగా నువ్వే ఎచ్చులకు పోవాలనుకుంటున్నావు"

"కానీ.. ఒక్కతే ఆడపిల్ల.."

"అయితే ఏంటి? నిన్నేం కాసిని కాఫీనీళ్ళిచ్చి పంపమనడంలేదే... అనవసరమైన ఆర్భాటాలొద్దనే చెప్పడం..."

"అవును బావా, రెండు గంటల గొప్పకోసం అన్ని లక్షలు తగలేయడం అవసరమా? ఫంక్షన్ హాల్ అద్దె లక్షన్నరంటే నాకైతే కళ్ళు తిరుగుతున్నాయ్.. డబ్బు కుప్పలుతెప్పలుగా వుండి ఏం చేసుకోవాలో అర్థంకానివాళ్ళు ఇలాంటి ఖర్చులు కళ్ళుమూసుకుని చేసేస్తారేమో. కానీ మనలాంటి సామాన్యులకి అంత పైకం సంపాదించాలంటే ఎన్నేళ్ళు పడుతుంది?!" అన్నాడు రామ్మోహన్.

సత్యం అందుకుని "భోజనం కూడా ఎంత ఖరీదైంది అనేదానికంటే రుచికరంగా వుండటం ముఖ్యం" అన్నాడు.

"ఇద్దరూ తెగ వాయిస్తున్నారే... సరే సింపుల్‌గానే కానిద్దాంలే" అన్నాడు సుందరం, వాళ్ళ మాటల్లో నిజాన్ని గ్రహించుకుని.

✻

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

తెలుగుగడ్డ

(అటకెక్కి దాక్కున్న భర్తనుద్దేశించి 'రజాకార్లు లోపలికి వస్తున్నారండీ..' అని భార్య హెచ్చరించడంతో భయంతో తుళ్ళిపడిన శాస్త్రి నిచ్చెన మెట్లమీంచి విరుచుకు పడిపోయాడు)

(30 వ భాగం)

సోమిదేవమ్మ రూపాయలపై దృష్టి పెట్టనేలేదు. పిల్లలిద్దర్నీ గబాలున కిందకు దింపి భర్తవద్దకు పరుగెత్తింది. అప్పటికప్పుడే అతడి నోటి వెంట, ముక్కులవెంట ధారాపాతంగా నెత్తురు కారిపోతోంది. సోయి లేకుండా నేలకరుచుకుని నెత్తుటిలో పడిపోయాడు.

"అయ్యో సామీ, నా దేవుడా" అంటూ ఆమె పెద్ద శోకాలు ప్రారంభించింది. ఇద్దరు రజాకార్లు ఇంట్లో ప్రవేశించారు. వారిరువురి కళ్లు ఒక్కసారిగా జిగేల్మన్నాయి. కుప్పలుతెప్పలుగా పడి ఉన్న రూపాయలన్నింటినీ పోగు చేస్తున్నారు. అన్నింటినీ ట్రంకు పెట్టెలో పోసుకుని పెట్టెనెత్తుకుని అప్పటికప్పుడే బయటికి వెళ్లిపోయారు.

సోమిదేవమ్మ మాత్రం శోకాలుతీస్తూ మతిలేని దానివలె వెళ్లిపోతూన్న రజాకార్ల వైపుకు వెర్రిచూపులు చూస్తూ కూర్చుంది. పిల్లలిద్దరూ బావురుమని ఏడుస్తూ దగ్గరకు వచ్చారు. వారిద్దరినీ దగ్గరకు తీసుకుని భర్తపైపడి మరింత బిగ్గరగా ఏడవనారంభించింది.

* * *

మల్లారెడ్డి, కృష్ణారెడ్డి ఇద్దరూ గ్రామాన్ని ఒకవైపుకు చుట్టువేసుకుని నల్లగూడానికి సూటిగా పరుగులు తీస్తున్నారు. ఉత్తరం వైపునుండి లారీలు చుట్టుకుని వస్తున్నాయి.

"ఒరే కృష్ణా, పరుగందుకోరా, లారీలు మనవైపుకే వస్తున్నాయి" అన్నాడు మల్లారెడ్డి.

ఇద్దరూ దక్షిణదిక్కుగా తిరిగి నల్లవాగువైపుకు పరుగు ప్రారంభించారు. చదరపు ప్రదేశాలు, మాగాణి భూములూ, బంజరు బీళ్లూ దాటుకుంటూ కలేపొదలు, బలుసు తుప్పలపైన ఎగిరిదూకుతూ ప్రాణాలకు తెగించి శరవేగంతో ముందుకు దూసుకుపోతున్నారు. వారిద్దరికీ దండచేతిలావు గస పుట్టుకువస్తోంది. రొమ్ములు గరిశలు పడిపోతున్నాయి. కాళ్లు చచ్చుబడి వెనుకకు లాగుతున్నాయి. అయినా శక్తినంతటినీ కూడదీసుకున్నారు. రెండు మైళ్ల దూరంలోవున్న నల్లవాగును సమీపించారు. వెనక్కితిరిగి చూశారు. వారికెక్కడా లారీల పొగ కూడా కనిపించలేదు.

"నాలుక పిడచకట్టుకుని పోతూందిరా మల్లా" అన్నాడు కృష్ణారెడ్డి రొప్పుతూ.

"నాకు యమదప్పిక అవుతోందిరా. నల్లవాగులో నీరేమయినా పారుతోందేమో చూద్దాం" అన్నాడు మల్లారెడ్డి. ఇద్దరూ కలసి ఆశతో పాతాళం మాదిరి చొచ్చుకుపోతూన్న వాగులోకి దిగారు. వారి ఆశలు అడియాసలయ్యాయి. వాగులో నీటిచుక్క కనిపించడం లేదు"

"ఎట్టాగురా మల్లా? నాలుక ఎండిపోతూంది" అన్నాడు కృష్ణారెడ్డి.

మల్లారెడ్డి నలుదిశగా పరికించాడు. వాగు ఒడ్డునున్న ఏరుమల్లె పొదకింద నీడలో నీటి తళుకు కనిపించింది. కృష్ణారెడ్డిని వెంటబెట్టుకుని మల్లారెడ్డి ఏరు మల్లెపొదనీడ కిందకు చేరాడు. అడుగుల్లోనున్న నీరు కొద్దిగా కనిపించింది.

"ఈ నీళ్లు మనం తాగేదెట్టాగురా?" అన్నాడు కృష్ణారెడ్డి.

"ఏమిట్రా నీ సోది. ఒకవైపున ప్రాణం పోతుంటేనూ? ఇసుకపై బోర్లా పండుకుని నీటిని నోటితో పీల్చు" అన్నాడు మల్లారెడ్డి.

అతడు చెప్పిన ఉపాయం కృష్ణారెడ్డికి నచ్చింది. ఇద్దరూ బోర్లా పండుకుని అక్కడక్కడా అడుగుల్లో ఉన్న నీటిని గుక్కెడు గుక్కెడు పీల్చా..

చివరికి కృష్ణారెడ్డి లేచి నిల్చున్నాడు. "నీళ్లలో చిన్న చిరుకప్పలున్నాయిరా, వీటి దుంపతెగా" అన్నాడు.

మల్లారెడ్డి కూడా లేచి నిలబడ్డాడు. "ప్రస్తుతం ప్రాణాలు మాత్రం నిల్చినాయి. అందుకు సంతోషించు" అన్నాడు. తరువాత ఇద్దరూ కలసి వాగు ఒడ్డునే ఉన్న తుమ్మల బీటిలోకి వెళ్లారు.

✻ ✻ ✻

ఆ సమయంలో ఎవరి ప్రాణం వారికి తీపి అయిపోయింది. ఒకరినొకరు చూడటమనేది లేదు. ఒకరి త్రోవ ఇంకొకరు పట్టకుండా ముక్కుకు సూటిగా కాలికొలదీ పరుగులు తీస్తున్నారు. గ్రామం వెలుపలి మైదానం అంతటా గొర్రెల మంద మాదిరి వెళ్లిపోతున్నారు ప్రజలు.

బండి తొట్టిలో కూర్చున్న పెద్దిరెడ్డి మాటమాటకు వెనక్కి తిరిగి చూస్తూ గిత్తలను అదిలిస్తున్నాడు. లారీలు దగ్గర పడుతూన్న కొద్దీ అతడి గుండెలు విపరీతంగా కొట్టుకుంటున్నాయి. చెంద్రకోల నెత్తి గిత్తల రెంటినీ రెండు చరుపులు చరిచాడు. గిత్తలు రెండూ చంగనం తీయనారంభించాయి. బండి బడబడలాడింది. బండిచక్రాలు భూమిపై అన్నీ ఆననట్లుగా తిరిగిపోతున్నాయి. నెర్రెలు, కందకాలు దూకుతూ బండి ముందుకుపోతోంది.

వెనుక లారీలమోత అతి సమీపంలో వినవస్తోంది. ముందు యూనియను బోర్డరు రెండు ఫర్లాంగుల్లోనే కనిపిస్తోంది. ఎలాగైనా బోర్డరుదాటి అవతలకు వెళ్లి పోవాలనే ఆదుర్దాతో తిరిగి అతడు చెంద్రకోలను ఛల్ మనిపించాడు. గిత్తలు రెండూ కన్నూమిన్నూ కానకుండా పరుగు ప్రారంభించినయ్. మరుక్షణమే వెలుపల చక్రం నెర్రెలో పడి గబాలున గుద్దుకుంది. లోపలి చక్రం నెర్రెలో పడి గుభీలున గుద్దుకుని ఉవ్వెత్తున పైకి లేచింది. బండి బోల్తాకొట్టింది. పెద్దిరెడ్డి బండికింద పడిపోయాడు. రెండు గిత్తలు సిర్రలు మెలగనేసుకుని దూరంగా నిల్చున్నాయి.

అప్పుడే లారీలు మోత పెట్టుకుంటూ వచ్చి పడిపోయిన బండి సమీపంలో ఆగిపోయాయి. లారీల్లోంచి రజాకార్లు, మిలటరీ కలిసి కలగాపులగంగా కిందికి దిగారు. అందరి వెనుక పటేలు అయోధ్యరాంరెడ్డి దిగారు.

దిగిన వారంతా పడిపోయిన బండిచుట్టూ మూగారు. మోకాళ్ల వరకు బండి చక్రాల కిందపడి గిలగిలా కొట్టుకుంటున్నవారికి పెద్దిరెడ్డి కనిపించాడు.

అది చూడగానే బడేమియా సంతోషంతో చప్పట్లు చరిచాడు. "వారెవా పెద్దిరెడ్డి కిందపడిపోయాడు" అనరిచాడు.

అప్పుడే జీపులోంచి దిగిన ఆఫీసరు అక్కడికి వచ్చి "క్యాహై" అనడిగాడు.

బండి చక్రాల కిందపడిన పెద్దిరెడ్డిని ఆఫీసరుకు చూపించి "ఏ బద్మాష్ యాదవరెడ్డి తండ్రీసాబ్" అన్నాడు బడేమియా.

"ఐసా?" అంటూ తలూపాడు ఆఫీసరు. అతడు రెండడుగులు ముందుకువేసి పెద్దిరెడ్డిని సమీపించి "క్యారే నీది కొడుకు ఎక్కడ ఉన్నాడూ?" అనడిగాడు.

అపరిమితమైన బాధలో ఉన్న పెద్దిరెడ్డికీ మాటలు వినిపించలేదు. ఆఫీసరువైపుకు వెర్రిగా చూస్తున్నాడు. ఆఫీసరు కాలిబూటుతో పెద్దిరెడ్డి తలపై తన్నాడు. "బోలోరే బేవ్‌ఖూఫ్" అన్నాడు.

పెద్దిరెడ్డికా మాటలు తెలియలేదు. కానీ రెండు చేతులూ జోడించి ఆఫీసరుకు దండంపెట్టాడు.

అంతలో బడేమియా కలిగించుకుని పెద్దపెట్టున నవ్వి "అరే పెద్దిరెడ్డి మాకీ దండం గిండం హటావేయను. నాదీ ఘోడాకు నీదీ గిత్త చంపివేసింది. నీదీ గిత్తాకు నేను కోస్కా తింటాను" అని తిరిగి పెద్దపెట్టున నవ్వాడు.

అతడి మాటలతో అక్కడి వారందరి చూపులూ బండిముందు అంకెలు వేసుకుని నిలబడ్డ గిత్తలవైపుకు మళ్లినయ్. నల్లగా కైలవేసి కండలుపట్టిన గిత్తలు కనిపించేసరికి అందరికీ నోళ్లూరినయ్.

ఆఫీసర్ మాత్రం "అచ్ఛాహై, గిత్తల్కీ పట్కారండి" అని ఆజ్ఞాపించాడు. అతడి ఆజ్ఞ అందడమే తడవుగా రజాకార్ల గుంపులోనుండి ఇద్దరు బండి ముందున్న గిత్తలవైపుకు నడిచారు. ఒకడు దాపరిగిత్త సిర్ర తొలగదీసి పగ్గం చేతపట్టుకున్నాడు. రెండవవాడు వెలపలి గిత్త సిర్రతొలగదీసి పగ్గంపట్టుకోబోతున్నాడు. వెలుపలిగిత్త బుసబుసలాడుతూ అతడిమీదికొచ్చింది. అతడు భయపడి వెనక్కి తగ్గాడు. గిత్త వేగంతో ముందుకు చొచ్చుకొచ్చింది. అతడి డొక్కలో కొమ్ములేసి కుమ్మింది. వెంటనే అతడు విరుచుకుని కిందపడ్డాడు.



చీల్చుకుని వచ్చిన పేగులు గిత్త కొమ్ములకు తగుల్కొని వేలాడుతున్నాయి" అదిచూసి అక్కడివారంతా హాహాకారాలు చేశారు.

"అది పోట్లగిత్త, కాల్చిపారేయండి" అనరిచాడు పటేలు.

"ఫైర్ ఫైర్" అంటూ ఆఫీసరు గొంతు చించుకున్నాడు. అరుస్తూన్న ఆఫీసరు వైపుకు సూటిగా గిత్త చెంగనంతీస్తూ వస్తోంది. ఆఫీసరు ఆదుర్దాగా పరుగెత్తుకుంటూపోయి జీపులో ఎక్కాడు. పగబట్టిన మాదిరిగా గిత్త జీపువైపుకు దూసుకుపోతోంది. మిగతా వారంతా కేకలు వేస్తూ రాళ్లూరప్పలూ విసురుతున్నారు.

జీపులో ఉన్న ఆఫీసరు "ఫైర్ ఫైర్" అని అరుస్తూనే ఉన్నాడు. గిత్త మహా రోషంతో జీపును గభీలున గుద్దింది. జీపు తల్లకిందులుగా తిరిగి పడిపోయింది.

మరుక్షణమే సిపాయిల చేతుల్లోని తుపాకులు "ధాం,ధాం..." అని శబ్దం చేసినయ్.

ఆ ధ్వనికి గిత్త కంగారుతో ఇంకో పక్కకు పరుగుపెట్టింది. అది చూసి దాపటి గిత్తకూడా పట్టుకున్న వాడిని గుంజుకుని చెంగనం ప్రారంభించింది.

పరారీ అవుతున్న గిత్తలవైపుకు పది తూటాలు వదిలారు. కాని చూస్తుండగానే గిత్తలు దూరంగా ఉన్న తాళ్లతోపులో ప్రవేశించి కనిపించకుండా పోయినయ్.

ఇంతలో జీపుకింద పడిన ఆఫీసరు కేకలు వినిపించాయి. అందరూ అక్కడికి పరిగెత్తారు. జీపునెత్తి ఆఫీసరును లేవదీశారు. అతడి తల, చేతులు కాళ్లకు బాగానే దెబ్బలు తగిలినయ్. కుంటుతూ రెండడుగులు వేశాడు. ఆ ప్రదేశమంతా కలియజూశాడు. పేగులు బయటపడి మూలుగుతున్న అహమ్మదు కనిపించాడు. క్రోధావేశపూరితుడయ్యాడు. అంతవరకూ బండిచక్రాల కిందపడి తన్నుకుంటున్న పెద్దిరెడ్డి వైపుకు చురచుర చూశాడు. "ఆ బద్మాష్‌ను తగ్లా పెట్టివేయండి" అన్నాడు.

ఆ మాటలలో పెద్దిరెడ్డిపై కక్ష సాధించాలని ఉక్రోషపడుతున్న బడేమియాకు బాగా సందు దొరికింది. తన అనుచరుల వైపుకు చూశాడు. "సాబ్ చెపుతున్నది విన్నారా? కంపా, కట్టె తీస్కొవచ్చి వాడిమీద వేసి అగ్గి ముట్టించండి. హర్రంకా బచ్చా, మాడి మశానం అయిపోతాడు" అన్నాడు. ఆ మాటలు పటేలు అయోధ్యరాంరెడ్డికి ఎంతో సంతోషాన్ని కలుగజేసినయ్. తృప్తిగా తలూపాడు.

తర్వాత పది నిముషాల్లోనే రజాకారులంతా కంపాకట్టె తెచ్చి పోగుచేశారు. బండి కిందనున్న పెద్దిరెడ్డిని బయటికి తీసి కాళ్లూచేతులూ అంటగట్టారు. కంచెపై పడేశారు. కింద నిప్పు ముట్టించారు.

మరుక్షణంలోనే మంటలు భగభగలాడుతూ పైకి లేచినాయి. శెగ తగిలిన కొద్దీ పెద్దిరెడ్డి పెడకేకలు వేయనారంభించాడు. బడేమియా, పటేలు సమీపంలో నిలబడి బండబూతులు తిడుతున్నారు. మిగతా రజాకారులంతా మంటల చుట్టూరా తిరుగుతున్నారు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల

అనవసరంగా భయపడ్డానే...

"**వె**ల్‌కంటు ఫ్రెషర్స్... డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం" కాలేజీకి ఎంటరయ్యేముందు కనిపిచ్చిన ఈ బ్యానర్స్ చూస్తూనే నా కళ్లు చమక్కున మెరిశాయి. నా ప్రమేయం లేకుండానే ఓ చిరునవ్వు పెదవులపై కదలాడింది. సీనియర్సే నాకు ఎదురుగా వచ్చి స్వాగతం చెబుతున్నట్లుగా అనిపించింది. క్యాంపస్‌లో అడుగుపెడుతున్నానన్న ఆనందంతో నేను ఉక్కిరి బిక్కిరయ్యాను. 'ఇక ఈ క్యాంపస్ నాదే, ఇక్కడ నాదే రాజ్యం' అన్న ఆలోచనే నాలో తెలియని గర్వాన్ని కలుగజేసింది. నా నడకలో ఏదో మార్పు... నా కళ్లల్లో ఏదో ఆత్మవిశ్వాసం... ఇంతలో... అల్లంతదూరంలో కనిపించారు వాళ్ళు. గుంపులుగా వస్తున్నారు. 'అమ్మో... సీనియర్సేమో... ర్యాగింగ్ చేస్తారేమో... ఇదే దార్లో వెళదామా... లేదా రూటు మార్చేద్దామా... ఇంకో రూటుకూడా తెలీదే...' టెన్షన్‌తో చమటల్లుపోశాయి. "నీకెవరెదురైనా బెదరకు. ఎలా నడుస్తున్నావో అదే వేగాన్ని కంటిన్యూ చేయ్. నువ్వు స్కాలర్‌వేమో అని వాళ్లనుకుంటారు. అప్పుడే నువ్వు ర్యాగింగ్ నుంచి తప్పించుకుంటావ్" ఫ్రెండ్స్ ఇచ్చిన సలహాలు చెవుల్లో గింగురుమంటున్నాయి. అయినా ఏం లాభం? ఎంత ప్రయత్నించినా అడుగులు పడట్లేదే... ఇక చేసేదేం లేదు. వారికీ నాకూ మధ్య కొంచెం దూరమే... నా కాళ్లు నాకు పూర్తిగా సహకరించడం మానేశాయ్. నేను ఆగిపోయాను. 'చచ్చాన్రా బాబోయ్' అని భయపడ్తుండగానే 'అరే... వాళ్ల రూటు మారిపోయిందే... అనవసరంగా భయపడ్డాను' అనుకోవాల్సొచ్చింది. మరికొందరెదురైనా వారంతా బుక్స్ రిఫర్ చేసుకుంటూనో, సబ్జెక్టుగురించి చర్చించుకుంటూనో చాలా బిజీగా నడుచుకుంటూ వెళ్ళారు. నన్నస్సలు పట్టించుకోలేదు. 'క్యాంపస్‌లో విద్యార్థులిలాగే ఉంటారు కాబోలు' అనుకున్నాను. కొద్దిదూరం నడవగానే కనిపించింది మా డిపార్ట్‌మెంట్ బిల్డింగ్. 'వావ్... ఈ పూల చెట్లూ, ఈ పరిసరాలు ఎంత బాగున్నాయి' అనుకుంటూ లోపలికడుగుపెట్టాను. 'ర్యాగింగ్ ఈజ్ ప్రొహిబిటెడ్...' పెద్ద అక్షరాలతో రాసుంది. 'నిజమేన్రోయ్!' అనుకున్నాను. ఇంతలో... క్లాస్ మొదలవబోతోందన్న సూచనగా బజర్ మోగింది. దాంతో పరుగులాంటి నడకతో క్లాసులోకి అడుగుపెట్టాను' – ఇదీ మొదటిరోజు క్యాంపస్‌లోకి అడుగుపెట్టిన ఓ విద్యార్థి మనోగతం. చాలామంది విద్యార్థులు ఇంచుమించు ఇలాగే ఫీలయ్యారట. మరి నోటీసు బోర్డులో చూసిన విషయం సంగతేంటని అడిగితే... ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో ఉన్నంత తీవ్రంగా ఏమీలేదని, మేం అనవసరంగా భయపడ్డామనీ చెబుతున్నారు ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు. "మా కాలేజ్‌లో అసలే లేదు" అని కోఠి ఉమెన్స్ కాలేజీ అమ్మాయిలంటున్నారు. మరి వీరి అనుభవాలేంటో తెలుసుకుందామా....

"క్యాంపస్‌లో మొదటి రోజు అడుగుపెట్టగానే భయమేసింది. ఫస్టవర్ అయిపోగానే సీనియర్స్ 'గెట్' అరేంజ్ చేశారు. పూర్తిగా తెలుగులో మమ్మల్ని మేం పరిచయం చేసుకోవాలని చెప్పారు. కొన్ని ఈవెంట్స్ చెప్పి వాటిని చేసి చూపించాలన్నారు. కొందరు మొండికేశారు. కొన్నిసార్లు బలవంతపెట్టినా, మరీ మొండికేసిన వారిని మాత్రం వదిలేశారు. మరికొందరు ఆనందంగానే వాళ్లు చెప్పినట్లు చేశారు. 'ఇదెక్కడ ర్యాగింగ్‌రా బాబూ... సైన్సు గ్రూప్ ఎందుకు తీసుకున్నానా...' అని మొదట్లో అనుకున్నాను. రోజులు గడుస్తుంటే ర్యాగింగ్ కూడా అవసరమే అనిపిస్తోంది. దీనివల్లే మేం మా సీనియర్స్‌తో చాలా స్నేహంగా ఉండగల్గుతున్నాం" అంటోంది ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్ చదువుతోన్న కవిత.

> సెలవురోజులు మాత్రం ఇక్కడున్న ప్రదేశాలు చూడ్డానికే మా సమయాన్ని వెచ్చిస్తాం. ఈ సైట్ సీయింగ్‌లో సీనియర్స్ మావెంట ఉంటారు. మొదట వారందుకు అంగీకరించలేదు. మేమే ఒప్పించాం.

"మేం ఇప్పటివరకూ చూసిన కల్చర్ వేరు. ఇక్కడ చూస్తున్నది వేరు. మేం హాస్టలర్స్ కాబట్టి సిటీ చూసే అవకాశం అంత ఎక్కువగా ఉండకపోవచ్చు. కానీ వీకెండ్స్, ఇతర సెలవురోజుల్ని మాత్రం ఇక్కడున్న ప్రదేశాలు చూడ్డానికే వెచ్చిస్తాం. ఈ సైట్ సీయింగ్‌లో సీనియర్స్ మావెంట ఉంటారు. మొదట వాళ్ళందుకు అంగీకరించలేదు. మేమే ఒప్పించాం. ముందు నిరాకరించినా తరువాత అంగీకరించారు. సీనియర్స్‌తో కలిసి బాగా ఎంజాయ్ చేయాలన్నదే మా అభిప్రాయం. అదీ ఈ రెండు మూడు నెలలే. మళ్లీ సెమిష్టర్ పరీక్షలు రాయడంలో బిజీ అయిపోతాం కదా" అంటున్నారు మరికొందరు విద్యార్థులు.

మరి కోఠి ఉమెన్స్ కాలేజీలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న గీత ఏం చెబుతోందంటే... "అమ్మాయిల కాలేజ్ గనుక ర్యాగింగ్ మరీ ఎక్కువగా ఉంటుందేమోనని భయపడ్డాను. 'హమ్మయ్య, క్లాసులు ప్రారంభమై వారం రోజులయిందిగా. ఇప్పుడు వెళితే పర్వాలేదు' అనుకుంటూ కాలేజీకెళ్లాను. 'ర్యాగింగ్ లాంటిదేమైనా...?' నా మాటలు పూర్తికాకముందే... 'అలాంటివేం లేవు గానీ... మొదటిరోజునుంచీ క్లాసులు చాలా రెగ్యులర్‌గా జరిగాయి. ప్రాక్టికల్స్ కూడా ప్రారంభమయ్యాయి' అన్నారు నా క్లాస్‌మేట్స్. అయ్యో... అనవసరంగా క్లాసులు మిస్సయ్యానే అనుకునేంతలో ఇంటర్వెల్ కాస్తా అయిపోయింది. వెంటనే ప్రొఫెసర్ క్లాసులోకొచ్చి పాఠం చెప్పడం ప్రారంభించారు. నేను పాఠం వినడంలో మునిగిపోయాను" అని చెబుతోంది గీత.

"అమ్మో... ఉమెన్స్‌కాలేజీనా... చచ్చాను బాబోయ్. అందరూ అమ్మాయిలే కాబట్టి ఖచ్చితంగా ర్యాగింగ్ ఉంటుంది" మీకు ఉమెన్స్ కాలేజీలో సీటొచ్చిందా? మీరూ ఇలానే ఫీలవుతున్నారా? మరి ఇవన్నీ అర్థంలేని అనుమానాలే అన్న విషయం మీకు అర్థమైందనుకుంటాను.

✳

సినిమా కబుర్లు

చందు

ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు

అందుకే జీవితాలకి దర్పణం పట్టి యువతలో ఉండే నిస్తేజాన్ని తొలగించాలన్న ఉద్దేశంతో దర్శకుడిని కావాలనుకునేవాడిని. ప్రథమ అవకాశం గనుక పరిస్థితులన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'మొగుడ్స్ పెళ్ళామ్స్' చిత్రానికి దర్శకత్వం వహించాను. అందరూ దర్శకత్వం ఓకె అన్నారు. దర్శకుడు కావడానికి 32 ఏళ్లు పట్టింది. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీగా ఉండడంతో దర్శకత్వం చేయడానికి గ్యాప్ దొరకలేదు. ఈమధ్య చిన్న గ్యాప్ వస్తే రెండు సినిమాలు వదులుకొని దర్శకత్వం చేయగలిగాను. మళ్ళీ ఇప్పుడు నటుడిగా బిజీ అయిపోయాను. తదుపరి దర్శకత్వం ఎప్పుడో!

వారిద్దరూ కలల్లోకి వచ్చేవారు

చిన్నప్పటినుంచి రామారావుగారు, నాగేశ్వరరావు గారంటే చాలా ఇష్టం. ఆ ఇద్దరూ నాకు కలల్లోకి వచ్చేవారు. నటన గురించి, జీవితం గురించి కలల్లో వారితో చర్చిస్తూ ఉండేవాడిని. నా ఫస్ట్ పిక్చర్ (బుద్ధిమంతుడు)లోనే 'టాటా వీడ్కోలు...' పాటలో నాగేశ్వరరావుగారితో నటించాను. నేను రామారావుగారితో నటించిన మొదటి చిత్రం లాయర్ విశ్వనాథ్. ఓసారి దాసరి నారాయణరావుగారితో రామారావుగారు 'బ్రదర్! రంగనాథ్ మంచి ఆర్టిస్ట్. మంచి దర్శకుల దగ్గర పడకపోవడం దురదృష్టకరం' అన్నారు. తోటి ఆర్టిస్ట్‌గా వారు నాకిచ్చిన కితాబది. చలన చిత్రరంగంలో నేను నిలదొక్కుకుంటానన్న విశ్వాసాన్నిచ్చిన నాగేశ్వరరావుగారి ప్రశంస ఏమిటో తెలుసా? హిందీ నటుడు అశోక్ కుమార్‌ది సహజ నటనని వారు అభిమానిస్తారట. అశోక్ కుమార్‌లో ఉన్న ఈజ్ నాలో ఉందన్నారు.

'మన పరువు కాపాడారు బ్రదర్':– వెండి తెరమీద ఒక మహా వీరునిగా ప్రఖ్యాతిగాంచిన ఎన్.టి.ఆర్ నన్నొక వీరునిగ ఆదరించిన సందర్భాన్ని నేనెలా మరిచిపోగలను? ఈమధ్య సినీ తారల క్రికెట్ మ్యాచ్ పరిపాటి అయింది. చలనచిత్ర పరిశ్రమ మద్రాసులో ఉన్న రోజుల్లో ఒక విశ్వవిద్యాలయానికి ఫండ్ ఏర్పాటుకై ఎల్.బి. స్టేడియంలో హిందీ, తెలుగు నటీనటుల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. హిందీ టీమ్‌కి దిలీప్ కుమార్, తెలుగు టీమ్‌కి ఎన్.టి.ఆర్. కెప్టెన్లు. మనవాళ్ళు ఒక్కొక్కరే బ్యాటింగ్‌కి వెళ్ళీ వెళ్లగానే అవుటై వెనుదిరుగుతున్నారు. నావంతు వచ్చింది. ముప్పావుగంటసేపు సారథితో కలసి నిలబడి, ఆడి అవుటై బయటకు వస్తుంటే జనం 'టైగర్ రంగనాథ్' అని అరుస్తుంటే ఎన్.టి.ఆర్. గ్రౌండ్‌లో నాకెదురొచ్చి కౌగిలించుకుని 'మన పరువు కాపాడారు బ్రదర్' అన్నారు. అది మధురానుభూతి కాదా? నేను జీవితంలో ఊహించని విచిత్రానుభూతి మరొకటుంది. నేను వారికి తండ్రిగా నటించడం. 'సామ్రాట్ అశోక'లో బిందుసారునిగా నటించాను. ఆ చిత్రంలో నటించిన కొద్దిరోజులే వారిని దగ్గర్నుండి గమనించడానికి దొరికిన మహదవకాశం. వారి విషయంలో నేను కోల్పోయిన సదవకాశం కూడా ఒకటుంది. 'దాన వీర శూర కర్ణ'లో అర్జున పాత్రధారణావకాశం. కారణం కాల్షీట్లు అడ్జస్ట్ కాకపోవడం. నా సినీ జీవితంలో నేను కోల్పోయిన మరి కొన్ని అవకాశాలు బాపూగారి 'ముత్యాల ముగ్గు', దాసరి నారాయణరావుగారి 'భారతంలో అమ్మాయి', మధుసూధనరావుగారి 'ఇద్దరూ ఇద్దరే'. కారణం కాల్షీట్స్. నిజంగా బాడ్ లక్.



సీనియర్ నటుడు రంగనాథ్ చెప్తోన్న కబుర్లు

నేనెవ్వరి రుణమూ వుంచుకోను, చిరంజీవిది తప్ప

నేను రేణిగుంటలో పెరిగాను. అక్కడ తెలుగు, తమిళ చిత్రాలు ఆడుతుండేవి. రెండూ చూసే భాగ్యం నాకు దక్కింది. రెండు భాషా చిత్రాల్లోనూ మంచి నటులున్నారు. తమిళంలో శివాజీగారు, తెలుగులో రంగారావు, గుమ్మడిగార్ల నటనకు ముగ్ధుణ్ణయ్యేవాడిని.

ఇక ఈతరం కొస్తే చిరంజీవి. చిరంజీవి నా నటనకు అభిమాని. నేను అతని సాధనా పటిమకు అభిమానిని. కొద్దికాలంలో అతడధిరోహించిన గమ్యాలు అనన్య సామాన్యాలు. తొలి దశలో అతనితో గడిపిన రోజులు నాకు సుమధురాలు. నంబర్‌వన్ అవుతావని ఆ రోజుల్లోనే అతనితో అన్నాను. కానీ వన్ టు టెన్ అయ్యాడు. 'అడవిదొంగ' శతదినోత్సవ సభలో (అది నాకు వందో సినిమా) చిరంజీవి సినీ వినీలాకాశంలోకి వదలబడిన వెలుగు బాణం అన్నాను. నటులు గిరిబాబు, శ్రీధర్, శరత్‌బాబు, నటి శారదగారు, విఠలాచార్యగారు, అల్లు అరవింద్‌గారు – వీళ్ళంతా నా ఆర్థిక ఇబ్బందుల్లో ఆదుకున్నారు. 'ఖైదీ' చిత్ర నిర్మాణ సమయమది. నా పుట్టినరోజున బస్సు నిండా నా అభిమానులు వచ్చారు. వారికి భోజన ఏర్పాట్లకై నా దగ్గర డబ్బుల్లేకపోతే చిరంజీవి వెయ్యో, రెండువేలో సర్దాడు. అభిమానులు ఆయనిచ్చిన డబ్బుతో భోజనం చేశారు కాబట్టేనేమో ఆయనకీ రోజున అభిమానులంతగా పెరిగారు. ఆయనకామొత్తం నేను తిరిగి ఇవ్వదల్చుకోలేదు. నేనెవ్వరి రుణమూ వుంచుకోను కానీ ఆయనకు మాత్రం రుణపడి ఉండదల్చుకున్నాను.

అందుకే నా జీవితంలో అతనికీ ప్రాముఖ్యం

చిరంజీవి గురించి నేనింతగా ఎందుకు చెబుతున్నానంటే... గతంలో నేను రాసిన గేయాలు విని మురిసిపోయినవాళ్ళలో చిరంజీవి ఒకడు. అతను అందరిలా మురిసిపోయి ఊరుకోలేదు. ఆ గేయాలన్నీ పుస్తకం వేయమని అడిగేవాడు. చివరికి నేను పుస్తకంగా వెయ్యనని నటుడు రాజేంద్రప్రసాద్‌కి ఆ పుస్తక ప్రచురణకు ఏర్పాట్లు చెయ్యమని పురమాయించాడు. దాంతో నా గేయాల్ని రెండు పుస్తకాలుగా అచ్చేయించాను. వాటి ఆవిష్కరణలో ఆయన ప్రెజెన్స్‌ని మిస్సయ్యాను. అది నా దురదృష్టం. నేను నటుడినవడానికి మా అమ్మ సంకల్పం కారణం. నా గేయాలు పుస్తకరూపం దాల్చడానికి చిరంజీవి నిరంతర ప్రోద్బలం కారణం. అందుకే నా జీవితంలో అతనికీ ప్రాముఖ్యం.

అందర్నీ ప్రేమించు... అందరిచేత ప్రేమించబడు

అర్హత వేరు, అదృష్టం వేరని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. మనం కోరుకున్న జీవితం మనకు ఏర్పడకపోవచ్చు. జీవితం నిన్ను తీసుకెళ్ళేదారంట ఇష్టంగా వెళ్ళు. కష్ట సుఖాలను సమానంగా ఆహ్వానించు. అహాన్ని చంపు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకు. అన్ని బలాల కన్నా ఆత్మబలం గొప్పది. ప్రతి నెగెటివ్‌నీ పాజిటివ్‌గా చేసుకో. ఉదాహరణకు మహాశక్తి తన పాద పూజా భాగ్యాన్ని నా భార్య పరిస్థితి రూపంలో నాకిచ్చిందన్నట్టు. అందర్నీ ప్రేమించు. అందరిచేత ప్రేమించబడు.

*

గుడ్డబొమ్మ అబ్బాయి

హాయ్ పిల్లలూ... మీరు ఎప్పుడైనా గుడ్డముక్కలతో బొమ్మలు చేశారా! చెయ్యలేదా. పోనీ చూశారా! మరి ఎలా వుంటాయవి? వాటితో ఆడుకోవాలనిపిస్తుందా! ఒకే... మరైతే ఇవాళ గుడ్డతో అబ్బాయి బొమ్మ చెయ్యడం ఎలాగో చెప్పకుందామే!

కావాల్సినవి: మనం చెయ్యాలనుకున్న బొమ్మ సైజును బట్టి బట్టను తీసుకోవాల్సి వుంటుంది. సాదా గుడ్డయితేనే మంచిది.

ఎలా చెయ్యాలంటే... ముందు ఒకేసైజు బట్ట ముక్కలు రెండు తీసుకోండి. ఒకదాని మీద చక్కగా అబ్బాయి బొమ్మ వెయ్యండి. మొదటి బొమ్మలో వుంది చూశారుగా. అలాగన్నమాట. తర్వాత బొమ్మ చుట్టూ ఒక అంగుళం స్థలం వుంచి మిగతా గుడ్డనంతా కత్తిరించండి. ఇదేవిధంగా మరో గుడ్డ మీదకూడా బొమ్మ వేసి కత్తిరించండి.

ఇప్పుడు రెండు గుడ్డ ముక్కలమీద వేసిన బొమ్మలను ఒకదాని మీద ఒకటి పెట్టి సరిగ్గా బొమ్మ అంచుల దగ్గర గీత మీద కుట్టండి. ఇలా అబ్బాయి బొమ్మ చుట్టూ కుట్టూ కుట్టుకుంటూ రావాలన్నమాట.

అయితే ఇలా పూర్తిగా కుట్టెయ్యకూడదు. రెండంగుళాల స్థలాన్ని కుట్టకుండా వదిలిపెట్టాలి. (2వ బొమ్మ)





కావాలా! ఇహ ఈ అబ్బాయి బొమ్మ గుడ్డను తిరగతిప్పాలి. ఇలా ఎందుకు చెయ్యాలంటే... మనం కుట్టినదంతా బయటకు కనిపించకుండానన్నమాట.

ఇప్పుడేం చేయాలంటే... కుట్టకుండా వదిలేశాం చూడండి. అక్కడి నుంచి చిన్న చిన్న గుడ్డ ముక్కలను (దూదైనా బానే వుంటుంది) దూర్చండి. ఇలా బొమ్మంతా గుడ్డముక్కలతో నింపేశాక ఆ ఖాళీని కూడా కుట్టేయాలి (3వ బొమ్మ). అంతే దాదాపుగా గుడ్డబొమ్మ అబ్బాయి రెడీ అయిపోయినట్టే.

కాకపోతే మొహం మీద కళ్లు, ముక్కు, నోరు గియ్యాలి. గీశాక రంగు దారాలతో వెరైటీగా కుట్టినా బానే వుంటుంది.

మీ పెద్దవాళ్లనడిగి ఈ అబ్బాయికి లాగూ చొక్కా కుట్టించి తొడగండి. సూపర్‌గుంటాడు. ఎంచక్కా ఆడుకోవచ్చు. లేకుంటే మీ స్నేహితులకు బహుమతిగానూ ఇవ్వొచ్చు. సరేనా.

(సూది, కత్తెర్లతో కూడిన పని ఇదంతా. కూసింత జాగ్రత్తగా వుండాలి మరి)



గుడ్డబొమ్మ అబ్బాయిని నేనే

ఆ 13 ఎక్కడున్నాయి!

Key, Ball, Fish, Bulb, Torch, Comb, Spanner, Hammer, Lady Bird, Spectacles, Toothbrush, Wedding Ring, Magnifying Lens

మిస్సయిన పార్టు వెయ్యండే

ఇంతకీ... ఏ గొర్రె ఊలు చుడుతున్నట్టు



విరిగిన ముక్క ఏది?



ఆరు తేడాలు కనుక్కోండి చూద్దాం



జవాబులు

విరిగిన ముక్క ఏది?

అయిదవ ముక్క

ఇంతకీ... ఏ గొర్రె ఊలు చుడుతున్నట్టు

ఏంటీ ... ఇంకా అర్థం కాలేదా? 'సి' గొర్రె ఊలు చుడుతున్నాడర్రా!

ఆరు తేడాలు కనుక్కోండి చూద్దాం

1.పాప హెయిర్ బ్యాండ్ 2. వాచ్ 3.పాప కాళ్ల దగ్గర ఎలుక నక్కిన కన్నం 4. ఫోను వైరు 5. టేబుల్ మీదున్న ఫోను 6. టేబుల్ కాళ్లు.

బొమ్మలేస్తారా!

మీరూ చక్కటి బొమ్మలేస్తారా? మరైతే ఆలస్యమెందుకు? ఎంచక్కా పోస్ట్ కార్డుమీద బొమ్మ వేసి రంగులు అద్ది మాకు పంపండే. ప్రచురిస్తాం. మా చిరునామా: చిన్నారి చిత్రకారులు, ప్రజాశక్తి, ఫ్లేట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాద్.

అట్టమీది కథ

ఆర్. ప్రవీణ్ కుమార్

తలకాయను పట్టకారులో పెట్టి నొక్కుతున్నట్లు..
వెయ్యికాకులు మన చుట్టూ తిరుగుతూ గోల చేస్తున్నట్లు..
వంద లారీలు హారన్ కొడుతూ ప్రదక్షణలు చేస్తున్నట్లు..
దిక్కుతోచక.. మెదడంతా హీటెక్కిపోయి ఉక్కపోస్తున్నట్లు..
నరాలను తీగలు చేసి వాయిస్తున్నట్లు..
నాడుల్లో పాదరసం వేగంగా ప్రవహిస్తున్నట్లు..
చికాకు.. విసుగు.. కోపం.. ఆందోళన.. భయం.. ఉద్వేగం..

నగర జీవితపు నరకయాతన స్ట్రెస్

సినిమాల్లో నరకలోకపు సీన్లలో కనిపించే ఈ దృశ్యాలన్నీ 'మానసిక ఆందోళన'తో బాధపడేవారికి రోజువారీ అనుభవంలోనివే. శారీరక, భావోద్వేగ ఒత్తిళ్ల ప్రభావమే 'స్ట్రెస్' అన్నది వైద్యుల నిర్వచనం. ఒత్తిడి అన్న నిఘంటు అర్థానికి 'స్ట్రెస్' వాడుతున్నా, నానార్థాల్లో 'బెంగ' కూడా ఉంది. కాబట్టి మనల్ని బెంగపెట్టించే విషయం ఏదైనా మనకు 'స్ట్రెస్'ను ప్రసాదించేదే. ప్రపంచీకరణ ఫలితంగా వేగవంతమైన నాగరిక జీవితంలో స్ట్రెస్ అనివార్యమైన అంశం. అయితే ఈ స్ట్రెస్‌లో రెండో కోణం కూడా ఉంది. పాజిటివ్ స్ట్రెస్‌తో లాభాలూ ఉన్నాయంటున్నారు వైద్యులు. అంతర్జాతీయంగా ఏటా 40 మిలియన్ల మంది ఈ 'స్ట్రెస్' బారిన పడుతున్నారంటే ఆశ్చర్యం కలుగకమానదు. మానసిక వైద్యుల్ని, సంప్రదించడం అంటేనే పెద్దతప్పుగా భావించే భారత్ లాంటి దేశాల్లోనూ ఈ 'ఆందోళన'కారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగానే 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్' అనేది ఇప్పుడు రిలాక్సేషన్ సెంటర్లకు కాసులు కురిపిస్తున్న సబ్జెక్ట్.

ప్రతీ మనిషి తనకు తెలీకుండానే నిరంతరం ఎంతోకొంత స్ట్రెస్‌కు



లోనవుతుంటాడు. పాప పుట్టిన వార్త, ఒక్కసారిగా వచ్చిపడ్డ ఉద్యోగోన్నతి, క్షభపెట్టే అనారోగ్యం, మనం ఆరాధించే వ్యక్తి ఆకస్మిక మృతి- ఇలా మంచి, చెడు కూడా ఒత్తిడికి గురిచేస్తాయి. అలాంటి సందర్భాల్లో సహజంగానే మనలో ఉండే మానసిక ఆందోళనతో ఒత్తిడి గణనీయంగా పెరిగిపోతుంది. మన జీవనశైలిని దానికనుగుణంగా సర్దుబాటు చేయడంలో లోనయ్యే శ్రమనే స్ట్రెస్‌గా నిర్వచించొచ్చు. ఆయా ప్రభావాల ఆధారంగా స్ట్రెస్ రెండు రకాలు. ఒకటి.. నెగటివ్ స్ట్రెస్. మానసిక ఆందోళన ఫలితంగా వచ్చేది. విసుగు, కోపం, ఆందోళన వంటివి కలిగి ఆరోగ్య అనర్థాలుగా పరిణమిస్తాయి. తలనొప్పి, కడుపులో దేవినట్లుండటం, ఇన్‌సోమ్నియా, అల్సర్, తీవ్ర రక్తపోటు, గుండెపోటు, ఇతర హృదయ సంబంధిత వ్యాధులు క్రమంగా చుట్టుముడతాయి. రెండోది.. పాజిటివ్ స్ట్రెస్. భావోద్వేగాల ఫలితంగా వచ్చేది. దీని కారణంగా ఉత్సుకత, జిజ్ఞాస మనలో పెరిగిపోతుంటాయి. అప్రమత్తంగా ఉండేలా ప్రేరేపిస్తాయి. ప్రతి వ్యక్తికీ సరిపడినంత స్ట్రెస్ (ఆప్టిమల్ లెవల్) లేకపోయినట్లయితే జీవితం నిస్సారంగా ఉంటుంది. నిస్పృహ, నిరాశతో బతుకు పరమ బోర్‌గా సాగుతుంటుంది.



కాల్‌సెంటర్లు కల్పతరువులు

మనదేశంలో బిపిఓ, కాల్‌సెంటర్లలో నెలకొన్న పనివరిస్థితులు కూడా 'స్ట్రెస్'ను గణనీయంగా పెంచుతున్నాయి. ఇక్కడ పనిచేసే 92శాతం మంది ఉద్యోగులు మానసిక ఆందోళనతో బాధపడుతున్నవారే. భారత్‌లో స్ట్రెస్‌కు గురవుతున్నవారిలో ఉద్యోగుల సంఖ్య 31శాతం. కాల్‌సెంటర్లలో ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఎక్కువ సమయం కంప్యూటర్‌పై గడపటం, పనిలో వేగంగా స్పందించాల్సి రావడం, పనివేళల్లో మార్పు, అలవాట్లకు భిన్నంగా ప్రవర్తించాల్సి రావడం, అభద్రత, నిద్రలేమి తదితర కారణాల వల్ల స్ట్రెస్‌కు గురవుతున్నారు. రోజంతా పడుకుని రాత్రివేళ పనిచేయడం కాల్‌సెంటర్ ఉద్యోగులకు తప్పనిసరి. పనిచేస్తున్న వాతావరణానికి భిన్నంగా ఇతర దేశస్థులతో మాట్లాడే సందర్భాల్లో అక్కడి వాతావరణానికి తగ్గట్టు మాట్లాడాల్సి రావడం వంటివి కూడా మానసిక ఇబ్బందులకు దారి తీస్తున్నాయి. అనైతిక సంబంధాలు కూడా కాల్‌సెంటర్ ఉద్యోగుల్లో స్ట్రెస్‌కు కారణాలన్నది వైద్యులు చెబుతున్న నిజం. తెలీని పనిచేయాల్సి రావడం, పనిలో తనకు సహాయ పడేవారు లేకపోవడం, అధిక పని ఒత్తిడి వంటివి ఆందోళనకు దారితీస్తున్నాయి. 'బాధ కలిగించే విషయమేంటంటే.. స్ట్రెస్‌తో బాధపడుతున్న అనేకమంది కాల్‌సెంటర్ ఉద్యోగులు, వీకెండ్‌ను భారీగా సెలబ్రేట్ చేసుకోవడం, పబ్, డిస్కోథెక్‌లకు వెళ్లడమే దానికి మందు అని భావిస్తున్నారు. అవేవీ పనిచేయక పరిస్థితి మరీ దిగజారితేనే మానసిక వైద్యనిపుణుల్నీ, స్ట్రెస్ కౌన్సిలర్లను సంప్రదిస్తున్నారు' – అని బెంగుళూరుకు చెందిన డాక్టర్ సుధాకృష్ణన్ తెలిపారు. పనిలోనే చిన్న చిన్న టెక్నిక్‌లు పాటిస్తే ఒత్తిడిని అదుపులో ఉంచవచ్చని ఆమె చెప్పారు.

మీకు తెలుసా..!

✻ ఎసిడిటీ వల్ల వచ్చే మానసిక ఒత్తిడి పుంసత్వాన్ని దెబ్బతీస్తుంది. ✻ ఆందోళన అధికంగా ఉన్నవాళ్లు పిచ్చివాళ్లుగా మారే ప్రమాదముంది. ✻ సాధారణంగా ఎక్కువగా అసాధారణంగా మరణాలు సంభవిస్తాయి. ✻ స్ట్రెస్‌కు గురయ్యేవారు తమ ఆడంబరాలు, అట్టహాసాలకు ఎక్కువ సమయాన్ని, డబ్బును ఖర్చుచేస్తారట. ✻ కొన్ని రకాల ఆందోళనల వల్ల స్థూలకాయం కూడా రావొచ్చు. ✻ కంప్యూటర్ సంబంధ వృత్తుల్లో ఉన్నవారిలో 92శాతం మంది స్ట్రెస్ పీడితులే. ✻ 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్'పై దాదాపు 17వేల వెబ్‌సైట్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. రోజురోజుకూ పెరుగుతోన్న స్ట్రెస్ పీడితులే వీరి పోషకులు. ✻ పురుషుల కన్నా మహిళలే ఎక్కువ స్ట్రెస్‌కు గురవుతున్నారు. సగటున మహిళలు పురుషునికంటే మూడురెట్లు ఎక్కువ స్ట్రెస్‌ను మౌనంగా భరిస్తూ ఉంటారు. ✻ విడాకుల సందర్భంలో మానసిక ఆందోళన ఫలితంగా ఏర్పడే స్ట్రెస్ కన్నా, పెళ్లి చేసుకుంటున్నానన్న ఉద్వేగానికి లోనైనపుడు ఎక్కువ స్ట్రెస్‌కు గురవుతారట. ✻ మనదేశంలో ఎక్కువ స్ట్రెస్‌కు గురవుతున్న నగరం నోయిడా. ఆ తర్వాతి స్థానాల్లో ముంబయి, బెంగుళూరు, ఢిల్లీ ఉన్నాయి. అతి తక్కువ స్ట్రెస్ కేసులు నమోదవుతున్న నగరం కోల్‌కటా.

స్ట్రెస్‌కు గురి చేస్తున్న అంశాలను విశ్లేషిస్తే.. ఉద్యోగం కారణంగా 31శాతం, మానవసంబంధాల ద్వారా 19శాతం, ఆర్థికపరమైన ఇబ్బందులతో 18శాతం, పిల్లల ద్వారా 11శాతం, పాఠశాల వ్యవహారాల ద్వారా 9శాతం, ఉగ్రవాదులు, ప్రకృతి వైపరీత్యాల భయంతో 3శాతం, ఇతరత్రా కారణాల ద్వారా 6శాతం మంది స్ట్రెస్‌కు లోనవుతున్నారు. పురుషుల కన్నా మహిళల్లోనే స్ట్రెస్ స్థాయి ఎక్కువగా ఉంది.

రోజువారీ పనిలోకానీ , శరీరంలోకానీ వచ్చే మార్పులు స్ట్రెస్‌కు దారితీస్తాయి. ఒక చర్యకు సంబంధించి ఏమవుతుందో ఏమోనన్న బెంగ, ఆ చర్య జరిగినదానికన్నా ఎక్కువ మానసిక ఒత్తిడిని కలిగిస్తుంది. స్ట్రెస్‌ను ఇలా లెక్కించాలన్నదానికి నిర్దిష్టమైన విధానమంటూ ఏదీ లేదు. కానీ మనస్తత్వ విశ్లేషకులు మాత్రం 12నెలల కాలంలో మీ జీవితంలో వచ్చిన మార్పుల ఆధారంగా మీరెంత స్ట్రెస్ అనుభవిస్తున్నారో తెలుసుకుంటారు. తక్షణ ఒత్తిడికన్నా దీర్ఘకాలిక ఆందోళన జీవితాన్ని ఎక్కువ కుదుపులకు గురిచేస్తుండటమే అందుకు కారణం.

మెదడు కణాల మధ్య మన భౌతికచర్యలకు సంబంధించిన సమాచారం నిరంతరం ప్రసారం అవుతూనే ఉంటుంది. మన నిద్రను, శక్తిని, మన హావభావాలను మూడు ప్రధాన కణాలు ఆపరేట్ చేస్తాయి. వీటిని రసాయన వార్తాహరులు (కెమికల్ మెసెంజర్లు) అంటారు. వీటి మధ్య సమాచార పంపిణీకి సంబంధించిన సమాచారం లోపిస్తే నిద్రలేమి, తలనొప్పి, ఒంటినొప్పులు, నిస్పృహ, ఉద్వేగాలకు లోనవుతాం. మితిమీరిన స్ట్రెస్ ఫలితమిది.

మహిళల్లో అత్యధికం

స్ట్రెస్ పీడితుల్లో మహిళల సంఖ్యే ఎక్కువగా ఉంది. పురుషుల్లో 76శాతం మంది, మహిళల్లో 84శాతం మంది ఆందోళనతో బాధపడుతున్నారు. ఆడవాళ్లల్లో స్ట్రెస్ సంఖ్యేకాదు స్థాయి కూడా ఎక్కువే. పురుషుల్లో 51శాతం వరకూ స్ట్రెస్‌స్థాయిని



ప్రపంచీకరణ తెచ్చిన చేటు

**"ప్రపంచం కుగ్రామమైపోతోంది.
ఎవరికీ ఊపిరాడనంతగా దేశాలు దగ్గరపడుతున్నాయ్.."**

ప్రపంచీకరణ ఫలితంగా మానసిక ఒత్తిళ్లు, ఆందోళన, మనోక్లేశం పెరిగిపోయి 'స్ట్రెస్'గా మారుతోంది. సహజంగానే మానసిక దారుఢ్యం ఎక్కువగా ఉండే గ్రామీణ భారత ప్రజలకూ, ప్రస్తుతం అనేకరకాలైన ఆందోళనలు, ఒత్తిళ్ళతో తల్లడిల్లుతున్న నగర యువతకూ మధ్య చాలా వ్యత్యాసముంది. వేగవంతమవుతున్న నగరజీవితం, తీరికలేని జీవనశైలి, పెరుగుతున్న నిరుద్యోగం, కరువవుతున్న ఉపాధి భద్రత, పనిగంటల పెంపు, అరకొర నివాస వసతులు, మహిళల్లో పోషకాహారలోపం.. ఇలా సృష్టింపబడిన కొత్త వాతావరణం 'స్ట్రెస్'కు నారూ, నీరూ పోస్తోంది. మనదేశంలో సంస్కరణలు వేగవంతమయ్యాక అంతరాలు క్రమంగా పెరిగిపోతున్నాయి. ఒకవైపు నిరుద్యోగ తీవ్రత, ఉద్యోగ అభద్రత గణనీయంగా పెరిగిపోతుండగా, మరోవైపు పనిభారం, ఉద్యోగ అవసరాలు ఎక్కువవుతుండటం.. రెండూ రెండు భిన్న కోణాలు. గ్లోబలైజేషన్ తీవ్రమవుతున్న కొద్దీ 'మానసిక ఆందోళన'కు దారితీసే అంశాల్లో వ్యక్తిగత కారణాలకన్నా సామాజిక కారణాలు క్రమంగా పెరుగుతుంటాయనేది అందరూ గుర్తించాల్సిన వాస్తవం.

'స్ట్రెస్' అన్న పదాన్ని ఇలా కూడా వాడాల్సి రావడం దశాబ్దం క్రితమే ప్రారంభమైంది. అయితే అది అంతేవేగంగా రెండువేల నాటికి భారత్‌లోని మహానగర వాసులవరకూ పాకిపోయింది. సెల్‌ఫోన్ టెక్నాలజీ అంతవేగంగా స్ట్రెస్ కూడా ఇప్పుడు అనేకులకు జీవన్మరణ సమస్య అయి కూర్చుంది' అంటున్నారు ఢిల్లీకి చెందిన మనస్తత్త్వ విశ్లేషకులు డాక్టర్ లక్ష్మణ్‌రావ్ సాంగ్లీకర్. దేశంలోనే అతిపెద్ద కాల్‌సెంటర్ హబ్ నోయిడాలోని ఇతని ఆసుపత్రికి వచ్చేవారిలో 81శాతం స్ట్రెస్ పీడితులే. వాస్తవానికి స్ట్రెస్ వ్యాధి కాదు. ప్రాణాంతకమైందేమీ లేదు. కానీ, ఎయిడ్స్ తర్వాత ఎక్కువమంది ఈ 'మానసిక ఆందోళన' గురించే ఆందోళన చెందుతున్నారన్నది తాజా సర్వేల సారాంశం. మనదేశంలో స్ట్రెస్ పీడితులు 10కోట్లపైనే ఉన్నారన్నది అనధికారిక లెక్కలు చెబుతున్న వాస్తవం.

కలిగి ఉంటే ఆడవాళ్లలో అది 62శాతం స్ట్రెస్ లెవల్ వరకూ మౌనంగా భరిస్తున్నారు. గృహసంబంధ, శారీరక సమస్యలు స్త్రీలను మానసిక ఒత్తిడికి లోనుచేస్తున్నాయి. కుటుంబ సమస్యల వల్ల 12శాతం పురుషుల కన్నా అధికంగా మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. యౌవనంలోకి అడుగుపెట్టే తరుణంలో, మెనోపాజ్ దశలో, ప్రెగ్నెన్సీ సమయంలో మహిళలు ఎక్కువ స్ట్రెస్‌కు లోనయ్యే అవకాశాలున్నాయి..

అమెరికాదే అగ్రస్థానం..

ప్రపంచంలో 'స్ట్రెస్' పీడితుల సంఖ్య అత్యధికంగా ఉన్నది అమెరికాలోనే. ఇక్కడ ప్రతి పదిమందిలో 8మంది మానసిక ఆందోళనతో బాధ పడుతున్నవారే. 'నేషనల్ కన్స్యూమర్ లీగ్' అనే సంస్థ ఇటీవల అమెరి కన్లలో స్ట్రెస్‌కు సంబంధించి ఆశ్చర్య కరమైన విషయా లను బయట పెట్టింది. మహిళల్లో 84శాతం మంది, పురుషుల్లో 76శాతం మంది దీని బాధితులే. 72శాతం వృద్ధుల్లో, మధ్యవయస్కులు దీనిబారిన పడగా, 82శాతం మంది యువకులు, టీనేజర్లు ఆందోళనతో విలవిల్లాడుతున్నారు. అంతేకాదండోయ్.. టెర్రరిస్టులు ఎప్పుడు దాడిచేస్తారో నన్న భయంతో 4శాతం మంది స్ట్రెస్‌కు గురవుతున్నారట. స్ట్రెస్ పీడితుడైన ఒక ఉద్యోగిని అతనికి ఏమాత్రం అనుభవం లేని, తెలియని పనిలో యాజమాన్యం పెట్టకూడదని అమెరికాలో ఓ చట్టం కూడా చేశారు. త్వరలో ఇలాంటివి మనదేశంలోనూ వచ్చినా ఆశ్చర్యం లేదు. *

అదుపు చేయండిలా..

(1) ఉహాశక్తికి మెరుగులు దిద్దండి. మిమ్మల్ని మీరు పాజిటివ్‌గా చూసుకోండి.
(2) స్వీయ హిప్నాటిజం
(3) యోగా
(4) శ్వాసక్రియలో ప్రయోగాలు
(5) ఇష్టమైన సంగీతాన్ని ఆస్వాదించడం (మ్యూజిక్ థెరపీ)
(6) మన జీవితంలోని విజయగాథలు మనమే రాసుకోవడం (సెల్ఫ్ జర్నలింగ్)
(7) మానసికోల్లాస క్రీడలు
(8) రొమాన్స్
(9) నవ్వుతూ, నవ్వించే ప్రయత్నం చేయడం
(10) వ్యాహ్యాళికి వెళ్లడం
(11) మొక్కల పెంపకం, నర్సరీ సాగు
(12) సమయపాలన, పని విభజన
(13) మితంగా ఆహారం, ఉదయానే బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరిగా తీసుకోవడం
(14) టీవీ చూడటం
(15) పుస్తకాలు చదవడం
(16) బాడీ లాంగ్వేజ్‌ను మెరుగుపరుచుకునే ప్రయత్నం, ఇతరుల్లో ఆ లక్షణాలను పరిశీలిస్తుండటం. మనకు అండగా నిలిచేవారి సంఖ్య పెంచుకోవడం.
(17) కంటినిండా నిద్ర
(18) ఉదయంపూట మన అలవాటు ప్రకారం వేడివేడి చాయ్ కానీ, పాలు కానీ తాగటం (వీలైతే యాంటీ ఆక్సిడెంట్లుండే 'గ్రీన్ టీ' తీసుకుంటే మంచిది)
(19) తరచూ ఆరోగ్యస్థాయిని పరీక్షించుకుంటూ ఉండటం (బయోఫీడ్‌బ్యాక్)
(20) మద్యం, కాఫీలకు దూరంగా ఉండాలి.

మీరెంత స్ట్రెస్'కు గురవుతున్నారో తెలుసా..

స్ట్రెస్	ఘటన విలువ
ఇష్టసఖి మరణం	100
యౌవన మార్పులు	65
విడాకులు	60
మెనోపాజ్	60
కుటుంబసభ్యుని మరణం	60
పెళ్లి ఆగిపోవడం	55
పెళ్లి	50
తీవ్ర అనారోగ్యం	45
పెళ్లి, లేదా భాగస్వామి ఎంపిక	45
పనిచేస్తున్నచోట అగ్నిప్రమాదం	45
మద్యం, డ్రగ్స్ సేవనం	45
పదవి / ఉద్యోగ విరమణ	40
కుటుంబసభ్యుని ఆరోగ్యంపై బెంగ	40
మితిమీరిన పనిఒత్తిడి	

స్ట్రెస్	ఘటన విలువ
(వారానికి 40గంటలు)	35
గర్భధారణ	35
సెక్స్ ఇబ్బందులు	35
కుటుంబంలోకి కొత్త సభ్యుని చేరిక	35
ఉద్యోగ బాధ్యతల్లో మార్పు	35
సన్నిహితుని మరణం	30
ప్రేయసి, జీవిత భాగస్వామితో	
తరుచూ వాదన	30
రుణ అవసరాలు	25
రాత్రి నిద్ర 8గంటలకన్నా తక్కువైతే	25
పిల్లలు, అత్తతో ఘర్షణ	25
వ్యక్తిగత విజయం	25
చదువు ప్రారంభం లేదా ముగింపు	20
నివాస స్థితిలో మార్పు	

స్ట్రెస్	ఘటన విలువ
(ఇల్లు, రూమ్‌మేట్స్ మార్పు)	20
వ్యక్తిగత అలవాట్లలో మార్పు	20
తీవ్ర అలర్జీ	20
పని గంటలు, స్థితిలో మార్పు	20
యజమానితో కష్టాలు	20
మతపరమైన చర్యల్లో మార్పులు	15
చేబదులు	10
విహార యాత్రలు, సెలవు దినాలు	10
సమాజంలో, చట్టాల్లో మార్పులపై	
ప్రతిస్పందన	5

గత 12 నెలల్లో మీరనుభవించిన ఘటనల విలువ 250ను మించితే తీవ్రస్ట్రెస్‌కు గురవుతున్నట్లు. 200నుంచి 250 మధ్యన ఉంటే స్ట్రెస్‌కు గురవుతున్నారని అర్థం. 100 నుంచి 150మధ్య ఉంటే స్ట్రెస్ ప్రభావమేమీ మీపై లేదన్నమాట.

వృద్ధాప్యం అనివార్యం. ప్రతిమనిషీ ఓరోజు వయసుమళ్లిన వారుగా మారవలసిందే. అందువల్ల నడివయసునుంచే రాబోయే వృద్ధ జీవితాన్ని సాగించేందుకు ప్రణాళిక వేసుకోవాలి.



ఆరోగ్యం

డాక్టర్ వి.ఎస్. నటరాజన్

వృద్ధాప్యంలో మళ్ళీ వసంతం వస్తుందా?

వ్యాధి రహిత జీవితం : సంపూర్ణమైన జీవితంకోసం ఎలాంటి శారీరక రుగ్మతలూ లేకపోయినా ఏడాదికోమారు వైద్య సలహా పొందడం అవసరం. కంటికి కానరాని రోగాలను ఈ పద్ధతిలోనే తెలుసుకోగలం. ఒక రోగం దాడిచేసేదాకా ఉపేక్షించడం ఎన్నటికీ మంచిదికాదు.

పోషకాహారం : మితిమీరిన ఆహారం తిని బరువు పెంచుకుని మధుమేహం, గుండెపోటులాంటి రోగాలను కొనితెచ్చుకోవడం కంటే స్వల్పమైన పోషకాహారం తీసుకుంటే అన్నివిధాలా మంచిది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మితంగా భోజనం, రాత్రి తక్కువగా భోజనం తీసుకోవాలి. వారికొపూట ఉపవాసం మంచిది. ఆకుకూరలు, పాలు, పండ్లు ఆరోగ్యాన్నిస్తాయి.

వ్యాయామం ఓ టానిక్: వ్యాయామం చాలా రోగాలను తరిమే యంగలదం.



మన మనసుకు కూడా దీనివల్ల ఉల్లాసంగా వుంటుంది. రాత్రివేళల్లో బాగా నిద్ర పడ్తుంది. వ్యాయామంవల్ల దుష్ఫలితాలుండవు. డబ్బు ఖర్చు లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక చేసే మేలు అంతాఇంతా కాదు.

ఏకాంతవాసం భయంకరం : వృద్ధాప్యంలో ఏకాంతం శత్రువు. అందువల్ల ఏకాంతాన్ని స్వీకరించకండి. ముసలితనంలో ఒంటరిగా వున్నవారికి ఆరోగ్య సమస్యలు ఆరురెట్లు అధికంగా వుంటాయని పరిశోధకుల నిశ్చితాభిప్రాయం. ప్రతి వ్యక్తి తనకిష్టమైన ఒక కాలక్షేపాన్ని ఎన్నుకోవాలి. పుస్తకాలు చదవడం, టీవీ చూడటం లాంటి వ్యాపకాల్లో నిమగ్నం కావచ్చు. ఫోను, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా బంధువులతోను, మిత్రులతోను తమ భావాలు కలబోసుకోవచ్చు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి : పొగ తాగడం, మద్యం సేవించడం లాంటి అలవాట్లకు దూరంగా వుండాలి. డబ్బు వ్యయం కావడమేగాక శరీర ఆరోగ్యాన్ని భయంకరంగా హరిస్తాయి. వృద్ధులు తమ అవసరాలన్నిటిని తామే పూర్తిచేసుకోవాలి. తమ పనులకు వేరొకరిపై ఆధారపడకూడదు. భోజనం చేయడం, మందులు వేసుకోవడం, బట్టలు సర్దుకోవడం లాంటి పనులు తామే చేసుకోవాలి.

ఆవశ్యకమైన సాధనాలు: వృద్ధులైనవారు విలువైన నగలు గట్రా తమ వద్ద వుంచుకోరాదు. ఇవి ఒక్కొక్కప్పుడు వారి ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చిపెడుతుంటాయి. కింది సాధనాలను వృద్ధులు సదా తమవద్ద వుంచుకోవడం మంచిది.

చేతికర్ర: అకస్మాత్తుగా స్పృహ తప్పో లేదా కాళ్ళు తడబడో కింద పడిపోతే ఎముకలు విరగవచ్చు. తలకు తీవ్రంగా దెబ్బ తగిలి రక్తస్రావం సంభవించవచ్చు. ఇందుకు సులభమైన విరుగుడు నడిచేటప్పుడు చేతికర్ర ఉపయోగించటం. ఎవరైనా పరిహాస దృష్టితో చూస్తారేమోనని సంకోచించకండి. చేతి కర్రే మీ అనుంగు మిత్రుడు.

వినికిడి సాధనం : వృద్ధాప్యంలో పలువురికి వినికిడిశక్తి తగ్గిపోతుంది. ఇందువల్ల వారు నలుగురిలో కలవలేక ఒంటరితనాన్ని వరించుకుంటారు. దీంతో వారు మానసికాందోళనకు గురయ్యే ప్రమాదం వుంది. కనుక వారు నిస్సంకోచంగా వినికిడి సాధనం అమర్చుకుని అందరితో కులాసాగా గడపాలి.

కట్టుడుపళ్లు: పళ్ళు రాలిపోయినపుడు ఆహారాన్ని నమిలి తినలేరు దాంతో శరీరానికి సరైన బలం అందదు. పళ్ళు లేకుంటే ఉచ్చారణ బాగుండదు. ముఖంలో కళ పోతుంది. వీటిని నివారించాలంటే కట్టుడుపళ్ళు కట్టించుకోవాలి.

కళ్లజోడు: జీవితంలో ఇతరుల సాయంలేకుండా బ్రతకటానికి కంటిచూపు అత్యంతావశ్యకం. అవసరమైతే కళ్లకు శస్త్ర చికిత్స చేసుకుని సరియైన కళ్ళజోడును ధరించి జీవితాన్ని సుఖమయం చేసుకోండి.

ధ్యానం, ప్రాణాయామం: ఇవి వృద్ధులకెంతో ఉపయోగకరమైనవి. వీటితో మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం రెండూ సిద్ధించే అవకాశాలున్నాయి.

మౌన దీక్ష, ఉపవాసాలు : ప్రతి రోజూ ఓ నిర్దిష్ట సమయంలో ఎవరితోనూ మాట్లాడకుండా మౌనవ్రతం పాటించటం వృద్ధులకెంతో మేలుచేస్తుంది. వారంలో ఒక పూట ఉపవాసముంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృద్ధుల జీవితంలో మళ్ళీ వసంతం తిరిగివస్తుంది.

దేశంలో ప్రప్రథమంగా వయోవృద్ధుల వైద్య విజ్ఞానం

ఒక మర్రి చెట్టు కథ: భారతదేశ వైద్య విజ్ఞాన చరిత్రలో 1978వ సంవత్సరం ఏప్రిల్ 26వ తేదీ ఎప్పటికీ గుర్తుంచుకోవలసినరోజు. 'వయోవృద్ధుల వైద్య విజ్ఞానం' **(Geriatrics)** అనే మర్రిచెట్టు బీజాన్ని మద్రాసు జనరల్ ఆస్పత్రిలో నాటిన ముఖ్యమైన రోజది. ఈ కొత్త చికిత్సాపద్ధతికి దివంగతులు డాక్టర్ ఎ.ఎల్. అణ్ణామలై సాయపడ్డారు. ఆయన నన్ను (వి.ఎస్. నటరాజన్) ఎంపికచేసి ఇంగ్లండులో వయోవృద్ధుల వైద్య విజ్ఞానంలో ప్రత్యేక శిక్షణ పొంది రావటానికి పంపారు.

1988 ప్రాంతంలో ఈ చెట్టు ఒక వృక్షంగా రూపొందింది. చెన్నైయ్ జనరల్ ఆస్పత్రిలో వయోవృద్ధుల చికిత్సావిభాగం ఒక సంపూర్ణమైన విభాగంగా పరిణతిచెందింది. ఇలాంటి వయోవృద్ధుల చికిత్స విభాగం భారతదేశంలో ఇదొక్కటే అనే ప్రశస్తిని పొందింది. వయోవృద్ధులను అక్కున చేర్చుకుని చల్లటి నీడనిచ్చి సేదదీర్చిన ఈ విభాగం చెన్నై పరిసర గ్రామాల్లోనూ పలు వైద్య శిబిరాలు నిర్వహించి అసంఖ్యాక వృద్ధులకు వచ్చే రోగాలపట్ల అవగాహన కలిగించటమే గాక, వారికవసరమైన చికిత్సకు సైతం కృషి చేస్తోంది.

27 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన వయోవృద్ధుల ప్రత్యేక చికిత్సావిభాగం ఈనాడు పెరిగి పెద్దదై ఊడలు దిగి విస్తరించి, ఎందరో వయసు మళ్ళినవారిని సేదదీర్చడం ఆనందం కలిగిస్తోంది. అందరి అభినందనలూ అందుకుంటోంది. మనం ఏకాకులమయ్యామనో, రోగాలతో సతమతమైనపుడు మనల్ని చూసుకునేవారు లేరనో ఇక దిగులు చెందాల్సిన పని లేదు. అలాంటివారు నాదరి చేరండి. నీడనిచ్చి రక్షిస్తానని తన కొమ్మలు చాచి మర్రిచెట్టు సాదరంగా పిలుస్తోంది.

అనువాదం: ఎ.జి.యతిరాజులు

*

కథ

పులి కల్యాణి

"అయితే బాన్మతీ... మనింట్లో సదీసప్పుడు కాకపోటానికి కారణం ఏంటో తెల్సిందా?"

భానుమతి తల అడ్డదిడ్డంగా ఊపింది.

మళ్ళీ అతనే "నేను కనిపెట్టినదాన్నిబట్టి ఒక పాపో... పిల్లాడో ఇంట్లో లేకపోడం...!" అనడంతో భానుమతికి జ్ఞానోదయమైంది. ఆవిడ చదువుకున్నదే. పెద్దలు తెచ్చిన సంబంధాల్లో గోపిరెడ్డిని ఆమోదించేసింది. అతను రైతుబిడ్డ. మంచి మాటకారి. చదువుకన్నా సామాజిక సంబంధాలు, వాటి పరిశీలనా ఎక్కువగా సహకరించాయతనికి. ఎర్రగా, ఎత్తుగా, ఏపుగా పెరిగిన పైరులా హుందాగా ఉంటాడు. ఇతరులను ఇట్టే ఆకర్షించే రూపం.

గోపిరెడ్డి, భానుమతులకు ఈ 'గడియారం ముల్లు' జీవితం నిస్సారంగా ఎందుకు తయారైందో ఆలోచించీ...ఆలోచించీ బుర్ర బద్దలు కొట్టుకున్న తర్వాత... అంటే పెళ్లయిన ఎనిమిదేళ్లకు గానీ అసలు విషయం బోధపడలేదు. ఇద్దరూ దీర్ఘంగా ఆలోచించి 'అది నిజవే'నని తేల్చుకున్నారు. తర్వాత పోట్లాట ప్రారంభమైంది. అట్లా పిల్లాపాపా కలగకపోవడానికి కారణం ఎవరు? 'నువ్వంటే నువ్వు' అని ఒకరిమీద ఒకరు ఎగిరి పడ్డారు. ఇద్దరూ డీలా పడిపోయారు. 'ఈ తగువు తీరడానికి అర్జంటుగా దగ్గర్లోని టౌనుకుపోయి మంచి డాక్టరును చూస్తేగానీ అసలు కారణం తెలీదు' అని భానుమతి తన పరిజ్ఞానంతో ఒక నిర్ణయానికొచ్చింది. దాంతో గోపిరెడ్డి రుసరుసలాడాడు.

❊ ❊ ❊

ఈ ఎనిమిదేళ్లలో గోపిరెడ్డి ఇటు ఇంట్లోనూ, అటు వ్యవసాయంలోనూ ఎదురుదెబ్బలకు గురయ్యాడు. మానసిక అశాంతికి లోనయ్యాడు. కరెంటు బిల్లుల మోత... సమయానికి వర్షాలు పడక... పంట సరిగా పండక... మార్కెట్లో ధర గిట్టుబాటు కాక... యమా చికాకు పడిపోతున్నాడు. అవతల పరపతి మీద తెచ్చిన అప్పులు పెరిగిపోతున్నాయి. దీంతో చికాకు పడిన గోపిరెడ్డి ముందు అప్పులిచ్చినవాళ్లనూ, ఆనక భానుమతినీ బూతులు తిట్టాడు. తర్వాత అసలు విషయం తెలుసుకుని సంబరపడిపోయాడు.

తన జతగాళ్లిద్దర్లో కాస్తంత బుర్ర తక్కువగా ఉండే బండరాముణ్ణి కూచోబెట్టి తన తత్వాన్ని వాడికి వివరించాడు.

"ఒరే రాముడూ, మనం డబ్బు ఓ చోట పారేసుకుని మరోచోట వెతకడంలో అర్థం లేదు. ఎక్కడ పారేసుకున్న డబ్బులు అక్కణ్ణే వెతుక్కోవాల. మన గుబురు చింత చెట్లలో మాసిటాల వరకు షెడ్డులాంటిది కట్టిపారెయ్యాల!" అంటూ ఆజ్ఞలు జారీ చేశాడు.

❊ ❊ ❊

డాక్టరు రంగారావు భార్యాభర్తలకు గంటలకొద్దీ వివిధ నిశిత పరీక్షలు చేశాడు. నోరు తెరిచాడు, మూశాడు. ఆ తర్వాత ఆవులించాడు. రంగారావు పూర్వాశ్రమంలో రంగయ్యే! డాక్టరీ చదివాడో, లేదో ఎవరికీ తెలీదు. తెలుసుకోవాల్సిన అవసరమూ లేదు. దీనిక్కారణం రంగయ్య రూపం. జ్ఞానాన్ని వెదజల్లి పారేస్తున్నట్లుండే కళ్లు, మడత నలగని ఖరీదైన చొక్కాలూ, మిలమిల మెరిసే ప్యాంటూ... అటు ఇంగ్లీషూ, ఇటు ఉర్దూ, తెలుగూ కలిసి డబ్బింగు హీరోలా కనిపిస్తూ రేగిపోయే జుట్టును అట్లా అరచేత్తో పైకెగతోసుకుంటూ దర్పం ఒలికిస్తుంటే... చాలామంది రోగులకు సూది గుచ్చకముందే సగం రోగం పారిపోయినట్లనిపించేది. దాంతో రంగారావు 'వ్యాపారం' మూడు పూలూ ఆరు కాయలుగా అభివృద్ధి చెందిపోయింది.

"పిల్లలు పుట్టడం లేదని మీరిద్దరూ పిల్లల్లా కీచులాడుకోకండి. పిల్లలూ, దేవుడూ చల్లనివారే. కొత్తగా 'సంతాన సాఫల్యకేంద్రం' ఏర్పాటు చేశాం. విదేశీ నిబంధనలు, స్వదేశీ టెక్నాలజీ..."

"ఇంతకీ లోపం నాలో ఉందా?.. దాన్లో ఏడ్చిందా?" గోపిరెడ్డి రుసరుసలాడాడు. డాక్టర్ రంగారావు మళ్లీ నోరుతెరచి, మూసి ఆవులించాడు.

"ఏంటయ్యా నువ్వనేదీ? మందులు వాడితే ఖచ్చితంగా పుడతారు. సిస్టర్.. ఆ కోర్సు మందులిటు పట్రా"

లోపల్నుండి సిస్టరు సందిట నిండుగా సీసాలు తెచ్చిపెట్టింది.

"ఇవి మాతర్లు.. ఈ సిరప్పులేమో చెరోసీసా... రోజూ ఉదయం ఓటి, సాయంకాలం మరోటి వేడి పాలలో కలుపుకు తాగాలి. ఉదయం మూతడు, సాయంత్రం మూతడు పచ్చిపాలలో సుబ్బరంగా రంగరించి తాగితే పండంటి పిల్లాడు... ష్యూర్! మరిక ఫీజివ్వండి"

అప్పుగా తెచ్చిన అయిదువేలు చెల్లించాడు గోపిరెడ్డి. భానుమతి కాస్తోకూస్తో చదువుకున్నా ఈ సీసాలు టాబ్లెట్లు వాడడం వల్ల పిల్లలెలా పుడతారన్న సందేహం ఏమాత్రమూ తట్టలేదు.

"రెడ్డిగారూ! ఇది మూడునెలల కోర్సు. ఖర్చుకు వెనకాడితే లాభంలేదు ఇదుగో!" అని పిల్లల బొమ్మలందించాడు. దాన్లో బోసినవ్వులు నవ్వుతున్న పసిపాపల బొమ్మలు చూసి భానుమతి ముచ్చటపడింది. దంపతులిద్దరూ పరమానందంగా సీసాలందుకుని బయటపడ్డారు.

❊ ❊ ❊

అప్పటికి రెండు నెలలకోర్సు దిగ్విజయంగా ముగిసింది. ఆరోజు సాయం సమయం. పనంతా ముగించుకుని భానుమతి లైటు వెలిగించింది. ఆందోళనలో పడింది. తమకు పెళ్లయి ఎనిమిదేళ్ళయింది. తోటి వాళ్లందరికీ ఇద్దరుముగ్గురు పిల్లలు... వాళ్లు మెడలో సంచీలు తగిలించుకుని బడికి పోతుంటే, తాను ఆబగా చూస్తుండి పోయింది. ఇంకా నయం తాను కాస్త మంచి పేరుతెచ్చుకుంది కాబట్టి ఎవరూ ఎత్తిపొడుపు మాటలు వాగలేదు. మరి వాళ్ల చూపులో... కొంపదీసి తనజీవితం ఇట్లా 'గొడ్రాలు' గానే వెళ్లిపోతుందా? పిల్లలసలే పుట్టకపోతే? ఇప్పుడే నలుగుర్లో తిరగలేకపోతోంది. ఛ...



మరీ వికారంగా 'గొడ్రాలు' అన్న పదం ఏం బావుంది? మరెట్లా పిలుచుకుంటే బావుంటుంది? మరో నాజూకు పదమేదైనాఉందా? 'సంతానహీనురాలు...' అబ్బా... ఈ పదం మరీ దరిద్రంగా ఉంది.

"ఛ..ఛ.. ఏంటీ ఛండాలమైన ఆలోచన్లు.. భానుమతి ఒళ్లు విరుచుకుని అద్దంముందు నిలబడింది. తన రూపం తనకే ముద్దొస్తోంది. ఉహు... తన సొగసూ, వర్చస్సూ తగ్గకపోవడానికి కారణం... పిల్లలు లేకపోవడమేనా?! ఒకరిద్దరు పుట్టి ఉంటే ఈ పొంకం ఇలాగే ఉండేదా?'

గుమ్మం దగ్గర బండరాముడి సకిలింపు వినిపించడంలో భానుమతి తెప్పరిల్లింది. "ఏంరా... మీ దొరేడీ? అవతల అసలు వానలే లేవాయె. ఒకట్రెండు పొడిజల్లులు కురిస్తే అరకలు కట్టి సాలిచ్చుకున్నారాయె. మరి మీరంతా తోటకాడ ఏం యవ్వారం ఎలగబెడ్తున్నట్లు?"

"యవ్వారం కాదమ్మా, యాపారం... యాపారం!" బండరాముడి గొంతు మహామొరటు, అతని రూపంలానే! ఉత్త కుక్కపేగుల సన్నాసి, ఏదీ దాచుకోడు. 'యాపారం' అనేసరికి భానుమతి మనసులో ఏదో అనుమానం తళుక్కుమంది.

"యాపారమో, యవ్వారమో.. వాళ్ళ కొంపలకు కల్లుకు గాని పోతున్నారా?" భానుమతి కసురుకునేసరికి అతను కంగారుపడ్డాడు.

"కల్లుగిల్లు అంత బందు పెట్టిండుగద దొర. ఇంగ ఈ పైసలు తీసుకోండి, మీకిచ్చి రమ్మండు" రాముడు పెద్దనోట్ల కట్టనే తువాలు మగతల్నుండి తీసిచ్చేసరికి భానుమతి నివ్వెరపోయి అందుకుంది.

❊ ❊ ❊

"రోజూ అన్ని డబ్బులు యాడ్నుంచి వస్తున్నాయి? ఏం చేస్తున్నరో జర నాకయిన చెప్పరాదు?!" భానుమతి గోముగా అడిగింది. బీరువాలోంచి డబ్బుకట్టలు తీసి లెక్క పెట్టుకుంటున్న గోపిరెడ్డి పెళపెళా నవ్వాడు.

"భానుమతీ, పోయినేడు కరువుగదా... వానలే లేకపాయె. ఈ ఏడు ఎనక్కి తిరిగి చూస్తే మన యవసాయం పెట్టుబళ్ళ మీద రెండు లక్షల అప్పైంది. వడ్డీలకువడ్డీలు కట్టినా తడిసి మోపెడైంది. ఈ ఏడూ వానల్లేవుగద... వారం కింద ఒకట్రెండు జల్లులు కురిసిపాయె... భానూ, మనిషి ఆశ మా పెద్దది. ఆశ లేకపోతే... మనిషి అసలు బతకలేడు. అదే ప్రాణం ఊపిరి..."

పందిరి మంచం మీద కూర్చుని రెడ్డి చెప్తుంటే భానుమతి బుద్ధిగా వింటోంది.

"ఈ వ్యవసాయం అచ్చిరాదు. జలాధారమే లేదాయె! చెరువులు, బోర్లు ఎండిపాయె. అందుకని ఇక యాపారం బెటరని, ఇందులో జొరిపోయినా"

"ఏం యాపారం?" భానుమతి విప్పారిన కళ్లతో అంది.

"అదేనే... 'ఆశ' బీజం లాంటిది. అది మొలకెత్తితే చిగుర్లేసి కాపుకాస్తదనే ఆరాటం.. భూమితల్లినే నమ్ముకున్నోళ్లేం చేస్తరు? అదునోపదునో చూసి దాన్లో నాలుగ్గింజలు జల్లుతారు. తమ ఆశల మొలకలు, మొక్కలై పంటపండుద్దని ఆశపడతాడు. అందుకే మిర్చి... పత్తి విత్తనాలకు బిజినెస్సు లగాయించిన మన చింతల కింద రేకులషెడ్డు అందుకే అబ్బో... విత్తనాల డీలర్లందరికీ విత్తనాలే సంచులు. సగం రేటుకే సప్లయి, వాళ్లకు యాభైశాతం లాభం!"

భానుమతి గుండెలు వేగంగా కొట్టుకోవడం మొదలెట్టాయి.

❊ ❊ ❊

ఆ మధ్యాహ్నం... భానుమతి మరింత ఉద్వేగానికి గురైంది. మూడునెల్లు, ఆరుసీసాల గోళీలు.. మందు వాడినా ఎలాంటి ఫలితమూ లేకపాయె. పెద్ద టెన్షను, గుండెల్లో గుబగుబ. ఈ జన్మలో తానిక తల్లినయ్యే యోగం లేదేమోననే భయం. చాతకానితనం, నిస్పృహ, చిరాకులతో పనిమనిషి మీద ఊరికే అంతెత్తున ఎగిరిపడింది. దాని తప్పేంలేదు. అది మొహం చిన్నబుచ్చుకుంది. బాధే, తానేం చెయ్యాలి? డాక్టరేమో రెండు కోర్సులకే ఖచ్చితంగా ఫలితం అన్నాడు. నమ్మబలికి బోలెడు డబ్బులు గుంజాడు. అతడిచ్చిన రంగుల పిల్లల ఫోటోలు చూస్తుంటే ఒళ్లంతా ఒకటే అవిర్లొస్తున్నాయి.

"అమ్మగారూ, డాక్టరు రంగారావును పోలీసులు పట్టుకున్నారట. మన పూజారి అయ్యాగారు అందర్తో చెప్తుండు. పిల్లలు గ్యారంటీ అని ఇస్తోన్న గోళీలు, గట్రా అన్నీ డూప్లికేటట. అంతా పచ్చి మోసం దగా అంటున్నారు"

భానుమతి మరింక విన్లేకపోయింది. ధఢాల్న గదిలోకిపోయి మంచం మీద పడి ఏడుపుకు తగులుకుంది.

❊ ❊ ❊

"నేనడిగిందానికి సూటిగా జవాబు చెప్పండి"

"ఏంటే, అడిగేదేంటీ? చెప్పాల్సిందేంటి?" గోపిరెడ్డి నోట్లకట్టలు బీరువాలో పెడుతూ అన్నాడు.

"మీరు అమ్ముతున్న విత్తనాలెక్కడివి? యాడ్నుంచి తెప్పించిన్రు? ఏ కంపెనీవి?" గోపిరెడ్డి అదిరిపడేలా నవ్వాడు.

"ఓసి పిచ్చిమొహావా... మనం కంపెనీ విత్తనాలు తెప్పిస్తే ఇంక ఆ హెడ్డా... గవీ ఎందుకే? వాటిని మనమే తయారుచేస్తున్నం. కల్లాల పొంటె తిరిగిపూడ్చి తెచ్చినవి. దుమ్ము దులిపి సుబ్రంచేసి రంగురంగుల అట్టపెట్టెలల్ల ప్యాకింగు చేసి..."

"మరి గవి మొలకెత్తకుంటే ఎట్లా?"

"విత్తనం మొలకెత్తడం దాని లచ్చనం. మొలకెత్తలేదంటే అది చచ్చిందాని కిందనే లెక్క. దానికి మనమేం చేస్తాం? ఎవడి కర్మ వాడిది. వదిలెయ్యాలె!"

భానుమతికి బుర్రంతా గిరగిరా తిరిగినట్లయింది.

"మరి వాట్నే నమ్ముకున్న రైతుల సంగతేంటి? అవి మొలకెత్తకపోతే వాళ్ళ బతుకులేం గావాలె? పనికిరాని మొలకలేస్తే వాడెలా బతకాలి! అసలే అన్యాయం అయిపోతున్న వాళ్ళు ఓ దెబ్బకు ఆగమైపోతారుకదా. నో... ఇది అన్యాయం, పాపం తగుల్తది"

"స్స్... వచ్చేది. లాభం సంపాదించుకోడానికిదో దారి. ఎవడో ఏదో అయిపోతాడని మనం ఆలోచిస్తూకూర్చుంటే ఐనట్లే.. యాపారం అంటేనే లాభం!"

"మొలకెత్తని వితనం చచ్చిందాన్తో సమానంగదా. మరి నా సంగతేంటి?"

"నీకేమైందే?" గోపిరెడ్డి చాలా ఆందోళనగా అన్నాడు.

"నేను గొడ్రాల్ని. అంటే మెలకెత్తని విత్తనంతో సమానం! చచ్చిందానికిందే లెక్క. మరేం మాట్లాడకు. నాకు డబ్బులక్కర్లేదు. నువ్వూ అవసరం లేదు" భానుమతి హిస్టీరియా వచ్చిందాన్లా వణికిపోతూ ఊగిపోతోంది.

"బుద్ధిగా ఎవడి డబ్బులు వాడికి వాపసు చేయండి. ఈ చండాలమైన యాపారం నాకక్కర్లేదు!"

"కానీ నాకవనరం. నీతో నాకేంటి? చానామందిట్లనే సంపాదిస్తున్నారు, నీకేం రోగం?"

"చెప్పేది నీకే. అన్నిరకాలుగా ఆగమై రైతులేడుస్తుంటే, వాళ్ళకు మళ్లా కల్తీ విత్తనాలు. ఘోరం.. అన్యాయం.." భానుమతి బిగ్గరగా అరిచింది.

ఒక్క ఉదుటున భానుమతి లేచి, బీరువాలోని నోట్ల కట్టలను చెల్లాచెదురుగా గదినిండా విరజిమ్మింది. గోపిరెడ్డి గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయాడు.

"ఈ డబ్బు నీక్కావాల్నంటే.. నా పీనుగను చూస్తావు, నీ ఇష్టం. నాకు ఇట్టాంటివి గిట్టవ్. లేదంటే నేనే పోలీసులకు, కలక్టరు తానకు పొయ్యి రిపోర్టిచ్చి అందర్నిక్కడికి తీసుకొస్తా!"

భానుమతి ఉద్రేకంగా, పిచ్చిపిచ్చిగా అరుస్తూనే ఉంది. గోపిరెడ్డి నోరెళ్లా తలొంచుకుని నిలబడ్డాడు.

మనమూ - మన నమ్మకాలు

పి. జ్యోతి

చెప్పులు తెచ్చిన తిప్పలు

అందుకే నీకూ, పిల్లలకూ ఎలాంటి హానీ లేకుండా అంతా సజావుగా సాగిపోయింది. నాకిన్ని శుభాలను తెచ్చిపెట్టిన ఈ చెప్పులు సంపదగాక మరేంటి? అందుకే వీటిని భద్రంగా అటకపైన దాచివుంచా...

సుబ్బారావ్‌కు ఎండవేడికి కాళ్లు మండిపోతున్నాయి. అతను డాన్స్ అనేది నేర్చుకోకపోయినా స్టెప్పులు వాటంతటవే ఆటోమేటిగ్గా పడిపోతున్నాయ్. లోపలినుండి రకరకాల పదాల కలయికతో రాగాలు కూడా తన్నుకు వచ్చేస్తున్నాయి. అప్పుడు గానీ ఓ కొత్త విషయం బోధపడలేదు పాపం సుబ్బారావ్‌కు. గొప్ప బాధ అనుభవించినట్లయితే భలే బాగా కవిత్వాలు వెల్లువలా గొంతులోనుండి వెలువడతాయని. ఇప్పుడదే జరిగింది, తాను పడే బాధకు ఇలా సంగీతం, కవిత్వం వాటంతటవే ఉప్పెనలా పొంగుకొచ్చేస్తున్నాయ్ ఎంచక్కా

ఇంతకీ ఈయనగారికొచ్చిన బాధేమీటనేగా? మీ సందేహం, 'ఉన్నదానిమీద విరక్తి... లేనిదానికోసం పాకులాట...' తను చేస్తున్న జాబ్ మీద అసంతృప్తి కలిగి కొత్త జాబ్‌లోకి మారిపోవాలన్న ఆశ కలిగింది.

అప్పటికీ భార్య సుబ్బలక్ష్మి చెవిన ఇల్లుకట్టుకుని మరీ చెప్పనే చెప్పింది. చివరికి విసుగ్గా "ఏదో ఉన్నంతలో సంతృప్తిగానే ఉన్నాం. మళ్ళీ కొత్త ఉద్యోగమంటూ ఎందుకొచ్చిన తిప్పలు?" అంది.

ఆమె మాటలు వినడమే ఆలస్యం ఇంతెత్తున ఎగిరిపడుతూ... "అంటే ఎప్పుడూ ఎక్కడవేసిన గొంగళి అక్కడే - అన్నట్టు సరిపెట్టుకోమంటావా...? అదేం కుదరదు. నేను జీవితాన్ని విశాలం చేసుకోవాలనుకుంటున్నా. అందుకోసం రాష్ట్రాలు, దేశాలూ తిరగాలనుకుంటున్నా. ఇపుడున్న జాబ్‌తో అవన్నీ తీరవని నీకు తెలుసు. అందుకే ఇందులోంచి మారిపోతే లైఫును ఎంజాయ్ చేయొచ్చు" అన్నాడు ధీమాగా!

"బాబూ! పొద్దున్నే మీతో వాదిస్తూ నేను కూచోలేను గానీ లోపల నాకు బోల్డు పనులున్నాయ్. మీరు ఆ అటకెందుకెక్కారు? ఇప్పుడక్కడున్న దుమ్ము, ధూళి అంతా లాగుతారా? అదంతా ఇంటినిండా పడిపోతుంది. దాన్ని శుభ్రం చేసుకోవడానికి వేరే పనులన్నీ మానేసి ఇక్కడే వుండాలి. ముందు మీరు కిందకు దిగండి" అంది అటకెక్కిన భర్తతో...

"అబ్బా.. ఆపు సుబ్బూ.. నేను ఒకటి తీసుకుని గానీ కిందకు దిగను. అంతవరకూ నువ్వెన్ని చెప్పినా దిగనుగాక దిగను" అన్నాడు మొండిగా అక్కణ్ణించి కదలకుండా.

"అయినా ఇల్లంతా వదిలేసి అక్కడేం దాచుకున్నారు? అదేమన్నా మాకెవ్వరికీ తెలియకూడని చిదంబర రహస్యమా?" అంది వెటకారంగా.

ఆమె అలా అంటూండగానే పైనుండి రెండు పాత చెప్పులు టకటక మంటూ కిందపడినయ్.

"ఛీ..! ఛీ..! ఈ పాత చెప్పులేంటి? ఏదో సంపదలా వీటిని పైనెప్పుడు భద్రంగా దాచుకున్నారూ...? ముందు తీసవతల పారేయండి" అంది వాటివంక చిరాగ్గా చూస్తూ.

"అసలు విషయం నీకు తెలీదుగానీ, వీటికెంత అద్భుత చరిత్ర వుందనుకున్నావ్? ఈ చెప్పులు వేసుకునే నేను డిగ్రీ పరీక్షలు బాగా రాసి డిస్టింక్షన్‌లో పాసయ్యాను. తర్వాత ఇప్పుడు చేస్తున్న ఉద్యోగం ఇంటర్వ్యూకు కూడా ఇవే వేసుకునెళ్ళాను. అంతే.. వందమందిలో నేనొక్కణ్ణే సెలక్టయ్యాను. ఇంకా చెప్పాలంటే నిన్ను పెళ్ళిచూపులు చూడటానికి వచ్చింది కూడా వీటితోనే. బాబు పుట్టినప్పుడు, పాప పుట్టినప్పుడు కూడా హాస్పిటల్‌కు ఇవి వేసుకునే వచ్చా. అందుకే నీకూ, పిల్లలకూ ఎలాంటి హానీ లేకుండా అంతా సజావుగా సాగిపోయింది. నాకిన్ని శుభాలను తెచ్చిపెట్టిన ఈ చెప్పులు సంపదగాక మరేంటి? అందుకే వీటిని భద్రంగా అటకపైన దాచివుంచా... మళ్లీ ఈరోజున ఎందుకు తీశాననుకున్నావ్? ఇవాళ వెళ్లే ఇంటర్వ్యూ ఆషామాషీ కాదు. గట్టి పోటీ వుంటుంది. అయినా సరే, ఇవి వేసుకుని వెళ్తే తప్పకుండా నేనే సెలక్టవుతానని నా నమ్మకం" ఆపకుండా, ఆనందంగా దంచేశాడు సుబ్బారావ్.

"ఏడ్చినట్టే ఉంది. ఇవి ఇక్ష్వాకుల కాలంనాటి చెప్పుల్లా ఉన్నాయ్, వేసుకుని నాలుగడుగులు వేయకుండానే పుటుక్కుమంటాయ్. అప్పుడు మీ చెప్పుల తిప్పలు చెప్పనలవికానివే ఔతాయ్"

"నువ్వింకేం మాట్లాడకు... నేవెడుతున్నా, ఏదీ ఓసారి నవ్వుతూ నువ్వెదుర్రా"

"ఇక అదొక్కటే తక్కువ. అయినా నేనెందుకూ...? మీ అచ్చొచ్చిన చెప్పులున్నాయ్‌గా... వెళ్లిరండి" అంది చిరాగ్గా.

అలా ఇంట్లోంచి బయటపడ్డ సుబ్బారావ్... ఇదిగో ఇలా నడిరోడ్డుమీద మండుటెండలో నాలుగడుగులు వేశాడో? లేదో? రెండు చెప్పులూ కూడబలుక్కున్నట్లు ఒక్క దెబ్బతో తెగిపోయినయ్. ఆ సమయంలో... అక్కడ చెప్పులు కుట్టేవాళ్లు లేక వాటిని ఓ చేత్తో పట్టుకుని, కాళ్లు చుర్ మని బొబ్బలెక్కుతుంటే... పోయే ఆటోని, వచ్చే ఆటోని ఆపుతున్నాడే కానీ, అన్నీ ఫుల్ రష్‌తో వాయువేగంతో వెళ్లిపోతున్నాయ్.

చేతి గడియారానికేసి చూసుకుంటే పన్నెండున్నరైంది. అంటే ఇంటర్వ్యూ టైమ్ దాటి కూడా గంట కావస్తోంది. ఈ బొబ్బలెక్కిన కాళ్లతో, ఏడుపుముఖంతో వెడితే అదుక్కునేవాడనుకుని తరిమికొట్టే ప్రమాదముంది. అచ్చొచ్చిన చెప్పులను నమ్ముకుంటే నాపని ఇలాగైందే?! సుబ్బూ చెప్పనే వుంది శిథిలావస్థలో వున్నాయని.. రోజూవారీ చెప్పులేసుకున్నా టైముకు వెళ్లేవాణ్ణి. బాగానే ప్రిపేరయ్యాను గనుక బహుశా సెలక్టయ్యేవాణ్ణేమో..' అనుకునేసరికి చేతిలో వున్న చెప్పులమీద చెప్పలేని కోపమొచ్చింది. అంతే బలంకొద్దీ వాటిని ఆమడదూరానికి విసిరి పారేశాడు. అవెళ్లి రోడ్డుపక్కనున్న తుప్పల్లో పడిపోయాయ్.

'హూ, ఏదైనా మనకున్న ప్రతిభాపాటవాలపై ఆధారపడివుంటుంది కానీ ఇలా చెప్పులనూ, చేంతాళ్లనూ నమ్ముకుంటే వస్తుందా' అని ఇందాక సుబ్బూ పలికిన వ్యంగ్యోక్తి చెవుల్లో వినిపిస్తుండగా నిజమేనని నిట్టూరుస్తూ ఓ చెప్పులషాపులోకి దారితీశాడు సుబ్బారావు, కొత్తవి కొనుక్కోవడానికి.

✻

టీ బ్రేక్

ఎం.వి.ఎస్. శర్మ



వేగం

సుబ్బారావు, అప్పారావులు అడవిలో నడుస్తున్నారు. హఠాత్తుగా ఓ సింహం వారి ఎదురుగా వచ్చి నిలబడింది. వారిని చూస్తూ గర్జించసాగింది. సుబ్బారావు ఆ సింహం కళ్లలోకి కళ్లు పెట్టిచూశాడు. హేండ్‌బ్యాగ్‌లోంచి రన్నింగ్ షూస్‌తీసి వేసుకోబోయాడు.

పక్కనున్న అప్పారావు అది గమనించి "అవెందుకురా? సింహంకంటే వేగంగా పరిగెట్టేద్దామనే" అనడిగాడు గుసగుసగా.

"అబ్బే, ఎందుకూ? నీకంటే వేగంగా పరిగెడితే సరిపోతుందిగా" అన్నాడు సుబ్బారావు.

కోరిక

"ఈ చెరువులో మునిగినవాళ్ళు ఏం కోరుకున్నా సరే అది వెంటనే లభిస్తుంది తెలుసా?!" అని టూరిస్టులకు చెప్పాడు గైడు.

సూర్యారావు గభుక్కున అందులో మునిగిలేచి బంగారం కోరుకున్నాడు. వెంటనే ఓ పెట్టెనిండా బంగారు బిస్కెట్లు అతడి నేతిలో ప్రత్యక్షమయ్యాయి.

సుబ్బారావు మునిగి లేచి డబ్బు కోరుకున్నాడు. అతడికి సూట్‌కేసులో నోట్లకట్టలు దక్కాయి. అప్పారావు మునిగి లేచేసరికి ఓ పిట్ట తలపై రెట్టవేసింది.

అప్పారావు చిరాగ్గా "అబ్బా.. రెట్ట!" అన్నాడు. అంతే అతని చేతులనిండా......

పోనీలే...



అరుణ్ చదువుకుంటున్న స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించనున్న ఓ నాటకంలో మొత్తం మీద వేషం సంపాదించాడా పిల్లాడు. హుషారుగా తండ్రి దగ్గరికెళ్ళి విషయం తెలిపాడు.

"అదేం వేషం?" అనడిగాడు అప్పారావు.

"పెళ్లై పాతికేళ్లయిన భర్త వేషం" అని చెప్పాడు అరుణ్.

"పోనీలే. ఈసారి కాకపోయినా వచ్చే నాటకంలోనైనా డైలాగులుండే వేషం వేద్దువులే" అని కొడుకును ఓదార్చాడు అప్పారావు.

ఎలా రానూ

సుబ్బారావూ, అప్పారావూ ఢిల్లీకి వెళ్లారు. ఓ పెద్ద హోటల్లో బసచేశారు. సుబ్బారావు ముందుగా తయారయ్యాడు. "నేను రెస్టారెంట్లో ఉంటా, నువ్వొచ్చెయ్" అని అప్పారావుకు చెప్పి వెళ్లిపోయాడు. అరగంట గడిచినా రాకపోయేసరికి ఫోనుచేశాడు. ఒక తలుపేమో బాత్‌రూమ్‌కు, ఇంకొకటి వార్డ్‌రోబ్‌కు ఉన్నాయి. మూడో దానిమీద 'డు నాట్ డిస్టర్బ్' అనుంది. ఎలా బైటికి రానూ?!' అంటూ విసుక్కున్నాడు అప్పారావు.



మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్: 9849130141
హిప్నో కమలాకర్

నేను డిగ్రీ చదువుతున్నాను. నేను మా అక్క కూతురు ప్రేమించుకున్నాం. అయితే నా మరదలికి వాళ్ళ వూళ్ళో ఎవరో అబ్బాయితో పరిచయం ఏర్పడిందని తెల్సింది. తర్వాత నాకు మా మరదలితో మాట్లాడబుద్ధి కాలేదు. ఒక సారామె మా ఇంటికి వచ్చినప్పుడు ఎందుకు నాతో మాట్లాడడంలేదని నిలదీసి అడిగింది. అప్పుడు నేను నా అనుమానాన్ని చెప్పాను. వాడెవడో నాకు తెలియదు. అయినా నేను వాడినెందుకు లవ్ చేస్తాను. అంటూ ఏడ్చింది. దాంతో నాకు వున్న అనుమానం పోయి మా అనుబంధం గట్టిపడింది. నా మరదలు నాకోసం చదువు పూర్తయ్యేదాకా, అంటే 5 సం॥ల పాటు వేచి వుంటానని కూడా చెప్పింది. ఆమె తనకు వచ్చే సంబంధాలను తిరస్కరించింది. అంతేకాదు, పెద్దలు ఎక్కువ ఒత్తిడి చేస్తుంటే, విషం తీసుకుంటానని కూడా బెదిరించింది. మా నాన్నగారు నీ మనసులో ఎవరైనా వుంటే చెప్పు అని అడిగారు. అపుడామె నా పేరు చెప్పకుండా, ఊళ్ళో తాను పరిచయం పెంచుకున్న మనిషిపేరు చెప్పింది. ఆమె నన్ను మోసం చేసిందేమో నాకు తెలియటం లేదు. లేదా ఇంకేదైనా కారణాలు వున్నాయో అర్థం కావటంలేదు. దయచేసి ఆమె మనస్తత్వం గురించి చెప్పి, నాకు సహాయం చేయండి.

సురేష్, నిజామాబాద్.

పరిపక్వత లేని ఆలోచన, చంచలమైన ఉద్వేగాలు ఆమె ప్రవర్తనకు మూలకారణం. పెళ్ళయిన తరువాత ఆమె మనసు మార్చుకుంటే, నువ్వు మరిన్నీ సమస్యల్లో ఇరుక్కునేవాడివి.. పెళ్ళికి ముందే ఆమె అలా ప్రవర్తించటం మూలంగా నీకు ఒక రకంగా మంచే జరిగింది. మనుషులు ఇలా కూడా ప్రవర్తిస్తారనే విషయాన్ని అర్థం చేసుకో! ఆమెపట్ల సానుభూతితో వ్యవహరించు. భవిష్యత్తులో నువ్వెలా వుండాలో, ఆలోచించుకో, ఒత్తిడికి గురి కాకుండా కెరీర్ మీద దృష్టి పెట్టు.

*

నేను గత ఆరు సం॥లుగా ఒక అమ్మాయిని చాలా డీప్‌గా ప్రేమిస్తున్నాను. ప్రస్తుతం ఆమె ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. నేను డిగ్రీ మూడవ సం॥రం చదువుతున్నాను. నేను ఆమెను సంవత్సరానికి రెండు, మూడుసార్లు చూస్తాను. కాని ఆమెతో మాట్లాడాలంటే భయమేస్తుంది. ఒకవేళ మాట్లాడినా విపరీతమైన టెన్షన్‌తో ఏదో మాట్లాడేస్తుంటాను. ఒకసారి నా ప్రేమను ఆమెదగ్గర ఎక్స్‌ప్రెస్ చేశాను. అయితే ఆమె నుండి ఎటువంటి రెస్పాన్సూ లేదు. కానీ వాళ్ల ఫ్రెండ్స్ నాతో ఆమె నిన్నే ప్రేమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె ధ్యాసలో పడి చదువును మర్చిపోయాను. నేనేం చేయాలో సలహా చెప్పగలరు.

రామబ్రహ్మం, విజయనగరం

నీవు రాసిన దానిని బట్టి, ఆ అమ్మాయి ఆరవ తరగతి, నువ్వు తొమ్మిదవ తరగతి చదువుతుండగా ఈ ప్రేమాయణం మొదలైందని అర్థమౌతోంది. ప్రస్తుతం నీ వయసు 20॥లు, ఆ అమ్మాయి వయసు 16 సం॥లు వుంటుంది. ఆమె మనుసు వికసించే తరుణం ఇది. పరిపక్వత లేని దశలో మొదలైన నీ ప్రేమ పక్వానికి చేరుకోవాలంటే, ఆమె కూడా పరిపక్వత చెందేదాకా వేచి చూడక తప్పదు. నువ్వు నీ ప్రేమను వ్యక్తపరిచినా ఆమె స్పందించకపోవటానికి కారణం కూడా అదే ! ఈ నేపథ్యంలో చదువులో వెనకపడితే అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం వుంది. అందుచేత జాగ్రత్తగా వ్యవహారించు. ముందు నీ చదువుమీద శ్రద్ధపెట్టి విజయవంతంగా పూర్తిచేయడం మంచిది.

*

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నో కమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, ఫ్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు



మానవజాతి 'క్షయ'ం కాకుండా చూడాలి!

ప్రపంచమంతా ఇప్పుడు హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి గురించి భయపడుతోంది. కానీ దాన్ని మించిన ప్రమాదం క్షయ వ్యాధినుండి ముంచుకొస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. మనకు తెలిసిన క్షయే కదా, ఏం చేస్తుంది అనుకుంటున్నారా? అయితే కింది వివరాలు చదవండి!

❖ ప్రపంచంలో ప్రతి సెకెనుకు ఒకరికి క్షయ వ్యాధి సోకుతున్నది. ప్రపంచ జనాభాలో మూడో వంతు మందికి ప్రస్తుతం ఈ వ్యాధి సోకింది. ❖ 2004లో ప్రపంచంలో 17 లక్షలమంది క్షయ వ్యాధితో చనిపోయారు. ప్రపంచంలో ఇతర ఏ అంటువ్యాధులకన్నా ఎక్కువమంది క్షయ వ్యాధివల్ల చనిపోతున్నారు. ❖ తక్షణం క్షయవ్యాధిని నివారించకపోతే మరో రెండు దశాబ్దాల్లో 100 కోట్లమందికి ఈ వ్యాధి సోకుతుంది. వారిలో 20 కోట్లమంది క్షయ వ్యాధిగ్రస్తులవుతారు. వారిలో 3.5 కోట్లమంది దానివల్ల చనిపోతారు.

క్షయ వ్యాధిని నయంచేయడానికి మందులు కనుగొని అరవైఏళ్లు గడుస్తున్నా నేటికీ ఈ వ్యాధి మానవజాతిని వెన్నాడుతూనేఉంది. ఎంతగా వెన్నాడుతున్నదంటే 1993వ సంవత్సరంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ క్షయవ్యాధికి సంబంధించి 'ప్రపంచ ఎమర్జెన్సీ' ప్రకటించింది. ఈ సంవత్సరం ఆరంభంలో 'క్షయను ఆపండి' అనే నినాదంతో ఒక వ్యూహాన్ని రూపొందించింది. దీని ప్రకారం 2015 నాటికి ప్రపంచంలో క్షయ వ్యాధిని పూర్తిగా అరికట్టాలి. కానీ విషాదం ఏమంటే ఇంతగా ప్రమాదకారి అయిన క్షయవ్యాధి నివారణగురించి కన్నా మానవులను చంపే ఆయుధాలకోసం వందల వేల రెట్లు ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారు. క్షయవ్యాధి పరిశోధనలమీదకన్నా ఆయుధాల పరిశోధనలమీద వందల వేల రెట్లు శాస్త్రవేత్తలనూ, నిపుణులనూ, పరికరాలనూ వెచ్చిస్తున్నారు.

క్షయగురించి ఇప్పుడు శాస్త్రవేత్తలు సరికొత్తగా చెబుతున్నదేమంటే ఈ వ్యాధి ఇప్పుడు పేద ప్రజల్లోనూ, పేద దేశాల్లోనూ ఎక్కువగా ఉంటోంది. దీన్ని గనుక సరైన రీతిలో నిర్మూలించకపోతే మందులకు లొంగని క్షయ క్రిములు అభివృద్ధి అయి పేద, ధనిక తేడా లేకుండా సర్వమానవులనూ 'క్షయ'ం చేస్తాయి. ఈ విషయం అర్థం చేసుకోవాలంటే 'క్షయ' క్రిములగురించి కొంచెం తెలుసుకోవాలి.

'క్షయ' వ్యాధిని ఇంగ్లీషులో ట్యూబర్క్యులోసిస్ (టిబి) అంటారు. మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బాక్టీరియా క్రిమివల్ల ఈ వ్యాధి వస్తుంది. ప్రాచీనకాలం నుండి ఈ వ్యాధి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాధి సోకినవారు శారీరకంగా క్షీణించి చనిపోతారు గనుక దీనికి 'క్షయ' అని పేరు పెట్టారు. యూరప్‌లో కూడా పూర్వం ఇదే పేరుతో ఈ వ్యాధిని పిలిచేవారు. క్షయకూ, ఎయిడ్స్ వ్యాధికీ కొన్ని పోలికలున్నాయి. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గేటప్పుడు తెమడనుండి, రక్తం నుండి టిబి క్రిములు బయటకు వచ్చి గాలిద్వారా వ్యాపిస్తాయి. టిబి వ్యాధిగ్రస్తులతో కలిసి నివసించేవారికీ, వారితో సన్నిహితంగా మెలిగేవారికీ ఈ వ్యాధి క్రిములు సోకుతాయి. సాధారణంగా ఈ బాక్టీరియా మనిషి ఊపిరితిత్తుల్లో వృద్ధిచెందుతుంది. కొన్నిసార్లు ఇతర అవయవాల్లో కూడా వృద్ధిచెందుతుంది. టిబి క్రిములను 'ట్యూబర్‌కిల్ బాసిల్లీ' అని కూడా పిలుస్తారు. ఈ క్రిములు ఊపిరితిత్తుల్లో వృద్ధిచెంది రక్తంద్వారా అన్ని భాగాలకూ వ్యాపిస్తాయి. అయితే మన శరీరంలోని రోగనిరోధకశక్తి ఈ క్రిములను అదుపులో ఉంచుతుంది. కాబట్టి సాధారణంగా మన శరీరంలో బాసిల్లి క్రిములున్నా వ్యాధి మాత్రం కనిపించదు. అయితే వృద్ధాప్యంవల్ల, లేక ఎయిడ్స్ వంటి రోగాలు సోకడంవల్ల, లేక ఇతర రూపాల్లో మన శరీరం బలహీనపడడంవల్ల ఈ బాసిల్లి క్రిములు చురుకుగా మారి శరీర కణాలను తిని వృద్ధిచెందడం ప్రారంభిస్తాయి.

అప్పుడు మనకు 'క్షయ' వ్యాధి వచ్చినట్లు చెబుతారు. అందువల్ల హెచ్ఐవి వైరస్ సోకినంతనే ఎయిడ్స్ వ్యాధి రానట్లే, టిబి క్రిములు సోకినంతనే మనిషికి 'క్షయ' వ్యాధి రాదు. అయితే పైన చెప్పినట్లు ప్రపంచంలో మూడోవంతు ప్రజల శరీరాల్లో ఈ వ్యాధిక్రిములున్నాయి. వీటిలో 5 నుండి 10 శాతం మందికి వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

ఇప్పుడు సమస్య 'క్షయ' వ్యాధివల్ల కాదు. ఎందుకంటే అరవైయేళ్ల క్రితమే ఈ వ్యాధిని నయంచేసే మందులు కనిపెట్టారు. కానీ ఈ మందులు ప్రపంచంలోని ప్రజలందరికీ ఉపయోగించకపోవడంవల్ల, ఉపయోగించినా సక్రమంగా వాడకపోవడం వల్ల మందులను తట్టుకుని పెరిగే 'క్షయ' క్రిములు అభివృద్ధి అవుతున్నాయి. ఈ వ్యాధికి సరిగా మందులు వాడకపోవడం, వాడినవారు కూడా మందులు కొనలేక, వైద్యుని పర్యవేక్షణ లేక మధ్యలోనే మానేయడంవల్ల మందులకు లొంగని బాక్టీరియాలు అభివృద్ధి అయ్యాయి. మందులకు లొంగని ఇటువంటి టిబి ప్రపంచంలోకి వచ్చి చాలాకాలం అయింది. దీన్ని 'డ్రగ్ రెసిస్టెంట్-టిబి' అంటున్నారు. ఇటువంటి టిబి క్రిములను సంహరించి జబ్బు నయం చేసేందుకు 'మల్టీ డ్రగ్'వైద్యం అభివృద్ధి చేశారు. అయితే ప్రభుత్వాలు గతం నుండి గుణపాఠంతో జాగ్రత్త తీసుకోకపోవడంవల్ల ఇప్పుడు టిబి బాక్టీరియాలు ఈ మందులకు కూడా లొంగకుండా పోయి 'మల్టీడ్రగ్ రెసిస్టెంట్-టిబి' అభివృద్ధి అయింది. ప్రస్తుతం మాజీ సోవియట్ రిపబ్లిక్కులలో ఈ వ్యాధి అధికంగా ఉంది. త్వరలోనే ప్రపంచమంతా వ్యాపిస్తుందంటున్నారు. ఇదే గనుక జరిగితే అప్పుడు ఈ బాక్టీరియాను అదుపుచేయడం ఏ మందులకూ సాధ్యంకాదు, మళ్లీ వాటిని కూడా చంపగలిగే మందులు తయారు చేస్తేతప్ప. కానీ డ్రగ్ రెసిస్టెంట్ టిబిని నయం చేయడం చాలా వ్యయంతోనూ, రోగికి ఎంతో యాతనతోనూ కూడిన పని. ఇప్పుడు ఒకవేళ మల్టీడ్రగ్ రెసిస్టెంట్-టిబిని నయం చేయడానికి భవిష్యత్తులో మందు తయారుచేసినా దానికి చాలా వ్యయం అవుతుంది. ఈ మందులతో చికిత్సకూడా రోగికి నరకయాతనతో కూడి ఉంటుంది. అయితే రానున్న అయిదేళ్లకాలంలో టిబికి కొత్త మందు కనుక్కొనే అవకాశం లేదని ఈ రంగంలో పరిశోధనలు చేస్తున్న నిపుణుల చెబుతున్నారు.

ఎడారిలో ఒయాసిస్సులాగా టిబి విషయంలో ఇటువంటి నిరాశాజనక వార్తల నడుమ ఇటీవల ఒక మంచి వార్త బయటికొచ్చింది. అదేమంటే టిబి క్రిములను ప్రతిఘటించే జన్యువులను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అమెరికాలోని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన ఇగోర్ కామ్నిక్ అనే రష్యన్ శాస్త్రవేత్తా, మరికొందరూ కలిసి ఎలుకల్లో ఇటువంటి జన్యువులను కనుగొన్నారు. ఈ జన్యువులు ఎలా పనిచేసి, టిబి క్రిములు అభివృద్ధిచెందకుండా ఆపగల్గుతాయో వారు గ్రహించారు. మనిషిలో కూడా ఇటువంటి జన్యువులే కొందరిలో ఈ వ్యాధికి నిరోధకశక్తి ఉండేట్లు చేస్తాయని వారు చెబుతున్నారు. ఈ పరిశోధనలు మరికొంత ముందుకెళితే టిబి నివారణకు జన్యుపరమైన పరిష్కారాలు లభిస్తాయేమో వేచి చూడాలి! ఈలోగా ప్రపంచదేశాల ప్రభుత్వాలన్నీ ఆయుధాలపై ఖర్చులు తగ్గించి 'క్షయ'నివారణపై ఖర్చు పెంచాలి. లేకుంటే మానవ జాతి 'క్షయ'మై పోతుంది.

✳

కొత్త పుస్తకాలు

నది నా పుట్టుక



పేరుకుతగ్గట్టు కవితాసంపుటికి 'అట్ట'హాసం బాగా నప్పిందనే చెప్పొచ్చు. విద్యాధికుడైన సబ్బని లక్ష్మీనారాయణగారి కలం నుంచి జాలువారిన ఈ యాభై కవితలూ పలు అంశాల్ని ఆధారంచేసుకుని రాసినట్లు అగుపిస్తాయి. ముచ్చటగా మూడుపుస్తకాలకు కర్తయైన సబ్బని ఇది నాలుగో ప్రయత్నంగా వెలువరించారు. లక్ష్మీనారాయణ పొందిన అవార్డులూ, రివార్డుల తాలూకు చిత్రాలు లోపలి అట్టభాగాల్లో ప్రచురించారు. 'కెరటం నాకు ఆదర్శం' అన్న కవిని చూశాం. 'చెట్టు నాకు ఆదర్శం' అన్న ఇస్మాయిల్‌గారి కవిత్వాన్ని ఆస్వాదించాం. ఈ కవి నదిని ఆదర్శంగా చేసుకుని పలుకవితలల్లాడు. నదిలాగే నేనూ నిత్యం ప్రవాహశీలినని ఎలుగెత్తి చాటాడు.

ముందు, వెనుకమాటలంటూ 'నస' పెట్టకుండా తనదైన శైలిలో రెండుముక్కలు ఆ ముఖంలో చెప్పాడీకవి. కవిత్వం నాఊపిరి. కవిత్వం నాప్రాణం. బహుశా కవిత్వం లేకుంటే నేను లేనంటాడు. ఇవి ఎంతో కాన్ఫిడెన్సుతో చెప్పిన అంశాలుగా కనిపిస్తాయి. వీరు వ్యక్తిగతాల నుండి సామాజికాంశాల దిశగా పొందిన స్పందనల్నే కవిత్వీకరించారు. నిబద్ధత, నిజాయితీలతోబాటు కవియైనవాడికి హృదయసంస్కారమూ ముఖ్యమే. ఈ గుణాలు లక్ష్మీనారాయణగారిలో ఉన్నట్లుగా ఈ పుస్తకంలోని కవితలే నిరూపిస్తాయి.

మినీ కవితల్లో ప్రేమ, నవ్వు, కుళ్లు, కులం, డబ్బు గురించి చక్కని విశ్లేషణ చేశారు. అలేగే ఇస్మాయిల్, కాళోజీ రెండు కవితాఖండికల్లో ప్రస్తుతించారు. 'మాట్లాడు' అనే కవితలో మాటయొక్క విలువను చక్కగా నిర్వచిస్తూ దాని ప్రయోజనాన్ని వివరిస్తారు. ఇంటిగురించి, గూడు గురించి, చదువుగురించి, పాదయాత్రలగురించిన కవితల్లో వస్తువును వివరించడంలో అక్కడక్కడా వ్యంగ్యాస్త్రాలు సంధించిన తీరుబాగుంది. 'నేతబ్రతుకులు' గురించిన కవితలో ఆవేదన కళ్లకు కట్టిస్తుంది. మనిషి కనీస అవసరాల గురించి ఎలుగెత్తి ఆక్రోశిస్తాడు కవి.

సునామీ, పరశువేది, జీవితం, ఆదర్శం, నదులు నాగరికతలు నేర్పుతాయి వంటి కవితలు జీవితాలకు దర్పణంగా నిలుస్తాయి. లక్ష్మీనారాయణగారు ఊహించినట్లుగా వీరి కవితలు కొందరిగానే కాకుండా అందర్నీ చదివించగలవని, ఆలోచింపజేయగలవని మనమాశిద్దాం.

నది నా పుట్టుక(కవితాసంపుటి) సబ్బని లక్ష్మీనారాయణ
పేజీలు-52, వెల-50రూపాయలు, ప్రతులకు- ఎస్.శారద, 6-6-302, సాయినగర్, కరీంనగర్-505001.మరియు విశాలాంధ్రబుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

- సూర్య

ప్రజాధ్వని

పాటలు

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి

వెల :35/-, పేజీలు : 144

ప్రతులకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్, విశాలాంధ్ర బుక్ హౌస్‌లలో...

అన్ని షాపుల్లో దొరుకును

నవ్వుల నవాబు

నసీరుద్దీన్ కథలు

పున: కథనం. పి. రాజేశ్వర రావు

వెల : 50/-, పేజీలు : 47

ప్రతులకు :

విశాలాంధ్ర బుక్ హౌస్‌లలో దొరుకుకును

స్పర్శ

నలభై కవితల సమాహారమే శ్రీ బండ్ల మాధవరావు 'స్పర్శ' కవితాసంపుటి. పేరుకుతగ్గ ముఖచిత్ర రచన 'గిరిధర్' సమకూర్చారు. ఎటువంటి హంగూ, ఆర్భాటాలూ, పరిచయవాక్యాలూ లేకుండా సాదాసీదాగా పరుగెడుతుంది వీరికవిత్వం. ఈ సంపుటిలోని కవితలు పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఇంకా ఆకాశవాణి, డిడి ఛానళ్లలోనూ వచ్చాయి. ఈ పుస్తకాన్ని మాధవరావుగారు తమ జీవిత భాగస్వామియైన ఉమారాణి గారికి అంకితంచేశారు.

నేడు వస్తున్న రొటీన్ కవిత్వానికి భిన్నంగా- నానీలు, హైకూలు, మినీ కవితలంటూ పలు ప్రయోగాలజోలికి పోకుండా ఈ కవితలు రాశారు. తన స్పందనలను స్పర్శరూపంలో చక్కగా కవిత్వీకరించారు. ఈ కవి విలక్షణతకు తోడు పీడితుల, పండితుల ఆర్తి, నిరాశానిస్పృహలు, ఆర్థిక అసమానతలు, ఆర్థికదుస్థితి వంటివెన్నో దర్శనమిస్తాయి. నిజాలనే కవిత్వీకరించి, నిబద్ధతతో కవితల్ని అల్లారు. భాషాభేషజం, సంస్కృత సమాసాలు, పదబంధాలు ఇందులో మచ్చుకైనా కనపడవు.

మరణం గురించి ఒక కవితలో మాధవరావు 'మరణం అనివార్యమైంది, కారణాలు ఏమైతేనేం, నడుస్తూనడుస్తూనే నువ్వు ఖండఖండాలుగా ఎగిరి పడొచ్చు' - అని నేడు సంఘంలోని మనిషి అభద్రతాభావాన్ని సూటిగా వివరిస్తారు. 'అబ్రకదబ్ర' అనే శీర్షికతో రాసిన కవిత మంత్రతంత్ర భూయిష్టంగా అనిపించినా నగ్నసత్యాలు అందులో దర్శనమిస్తాయి.

'ఇక్కడొక మహాఇంద్రజాల ప్రదర్శన మొదలైంది. అరచేతిలోంచో, మ్యూజిక్ పెట్టెలోంచో రకరకాల వైకుంఠాలు ప్రత్యక్షప్రసారమవుతుంటాయి' అన్నవాక్యాలు ఇవాళ్టి ఘటనాఘటన అనిశ్చితస్థితిని వ్యక్తంచేస్తాయి. కవితాఖండికలకు పేర్లుపెట్టడంలోనూ ఈ కవి ఒక ప్రత్యేకతను కలిగినట్లు వాటినిచూస్తే అర్థమవుతుంది. మొత్తానికి ఈ కవిత్వం బరువుకు బరువు, వస్తువుకివస్తువు కలిగి చదువరులను భారంగా నిట్టూర్చేలా చేస్తోంది.



- డాక్టర్ మంతెన

స్పర్శ (కవితాసంపుటి) కవి: బండ్ల మాధవరావు పేజీలు-80, వెల-30రూపాయలు.
ప్రతులకు- నవోదయ పబ్లిషర్స్, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2, కె.ఉమారాణి, ఫ్లాట్‌నెం.3, నాలుగో అంతస్తు, వినాయక్ విహార్, ఎన్ఎస్ఎమ్ హైస్కూల్‌దగ్గర, పటమట, విజయవాడ-520007)

స్వీట్ దోశ



కావలసిన పదార్థాలు

మినప్పప్పు	-	ఒక కప్పు
బియ్యం	-	రెండు కప్పులు
యాలకులపొడి	-	అరస్పూన్
బెల్లం	-	పావుకేజీ
పచ్చి కొబ్బరి తురుము	-	రెండు కప్పులు
నెయ్యి	-	ఒక కప్పు

తయారుచేసే పద్ధతి

మినప్పప్పు బియ్యాన్ని వేరు వేరుగా నీటిలో పోసి ఓపూట నానబెట్టుకోవాలి తరువాత నీరు తీసేసి మిక్సీలో వేసి మొత్తగా రుబ్బుకోవాలి. దీనిలో బెల్లం తరిగి వేసి కొబ్బరి తురుము, యాలకుపొడి వేసి బాగా కలిపి ఓపూట పిండిని నాననివ్వాలి. తర్వాత పెనంమీద నెయ్యిరాసి పిండిని దోశలాగా వేసి నిదానంగా కాల్చాలి. ఇవి వేడిమీద తింటే రుచిగా వుంటాయి.

- జ్యోతి

అరటికాయ బజ్జీ

కావలసిన పదార్థాలు

శనగ పిండి	-	రెండు కప్పులు
బియ్యం	-	అర కప్పు
అరటికాయలు	-	రెండు పెద్దవి
కారం	-	ఒక స్పూన్
ఉప్పు	-	తగినంత
పసుపు	-	చిటికెడు
బేకింగ్ సోడా	-	పావు స్పూన్
నూనె	-	సరిపడ.

తయారుచేసే పద్ధతి

ముందుగా అరటికాలను పొట్టుతీసి పలుచగా చక్రాల మాదిరిగా తరిగి పెట్టుకోవాలి. తర్వాత శనగపిండి, బియ్యం పిండిని ఓ గిన్నెలోకి తీసుకొని కారం, ఉప్పు, పసుపు, బేకింగ్ పౌడర్ వేసి నీరుపోసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. బాణలిలో నూనె కాగనిచ్చి శనగపిండిలో అరటికాయ చక్రాలను ఒక్కొక్కటీ ముంచి నూనెలో వేసి ఎర్రగా వేయించి తీస్తే అరటికాయ బజ్జీలు సిద్ధం.

ఉపాయం

వాసాల నరసయ్య

అఖిల్, నిఖిల్ ఇరుగుపొరుగు వారి పిల్లలు. ఆ ఇద్దరూ ఒకే వాడలో వుంటూ ఒకే బడిలో పదవ తరగతి చదువుతున్నారు. అఖిల్‌ది అంతా ఒక పద్ధతి ప్రకారం ఉంటుంది. తనకు పుస్తకాలంటే వల్లమాలిన అభిమానం. వాటిని అస్సలు నలగనివ్వడు. చిరగనివ్వడు. తనకు నచ్చిన ఏ పుస్తకమైనా సరే! ఎంత వెలగలదైనా సరే... అమ్మానాన్నలనడిగి కొనిపించుకుంటాడు. ఆమూలాగ్రం చదివేస్తాడు. చదివింది పదుగురికీ చెప్తాడు. అంతేనా? అడిగిన పుస్తకం లేదనకుండా అందరికీ ఇస్తుంటాడు.

అలాంటి అఖిల్ ఒక ఆదివారం తన పుస్తకాలను సర్దడంలో మునిగిపోయాడు. వాటిని విషయం వారీగా వేరుచేసి, షెల్ఫుల్లో జాగ్రత్తగా సర్దేశాడు. తృప్తిగా చూచుకున్నాడు. తనకంటూ ఒక చిన్న లైబ్రరీ తయారయ్యిందని సంబరపడిపోయాడు.

రాత్రి భోజనం ముగించుకొచ్చిన అఖిల్ తన లైబ్రరీలోని పుస్తకాలను శ్రద్ధగా చూస్తుండిపోయాడు. వాటిల్లో కొన్ని మాసిపోయినట్లు గమనించాడు. నెమ్మదిగా బయటకు తీసి పేజీలు తిప్పాడు. ఎవరో కొన్ని పేరాలకు మార్కులు, గుర్తులు పెట్టారు. అక్కడక్కడా పేజీలు మడిచారు. వాక్యాల కింద గీతలు గీశారు. కవరు పేజీలు మాసిపోయి, చిరిగిపోయాయి. అదంతా చూశాక అఖిల్‌కు బాధ కలిగింది.

అఖిల్ చాలాసేపు అశాంతిగా గడిపాడు. చికాకుపడ్డాడు. ఆ తర్వాత 'అదంతా ఎవరిపనై వుంటుందా?' అని ఆలోచించాడు. చివరికి అదంతా అసూయతో నిఖిల్ చేస్తున్న పనేనని తేలిపోయింది.

ఏదైనా ఉపాయం ఆలోచించి నిఖిల్‌కు బుద్ధిచెప్పాలని అనుకున్నాడు. తీవ్రంగా ఆలోచించగా ఓ తమాషా పథకం అఖిల్ బుర్రలో మెరిసింది. అదేదో వెంటనే అమలుపరచాలని నిర్ణయించుకొని నిశ్చింతగా నిద్రపోయాడు.

మర్నాడు అఖిల్ బడి నుండి వస్తూ తను అనుకొన్నవి కొని తెచ్చుకున్నాడు. అనుకున్నట్టుగానే ఆ రోజు సాయంత్రం తనకో మంచి పుస్తకం కావాలంటూ నిఖిల్ వచ్చాడు.

అఖిల్ నిశ్శబ్దంగానే లేచి వెళ్లి ఒక కొత్త పుస్తకం ఇచ్చాడు. తోడుగా ఒక జిగురు సీసా, సూది, దారం, ఒక రబ్బరు ముక్క కూడా ఇచ్చాడు.

నిఖిల్ బిత్తరపోయాడు. "పుస్తకమడిగింది చదువుకోడానికే. తోడుగా ఇవన్నీ ఎందుకు?" అని అసహనంగా ప్రశ్నించాడు.

అఖిల్ చిరునవ్వుతో, "మరేం లేదురా! తీసుకెళ్లిన పుస్తకం త్వరగా ఇవ్వవు. అంతేనా శుభ్రంగా తిరిగి ఇవ్వవు కదా! అందుకే పేజీలు చిరిగితే అంటించడానికి జిగురు సీసా, పేజీలు ఊడితే కుట్టడానికి సూది, దారం, గీసిన గీతలు చెరిపేయడానికి రబ్బరు ఇచ్చాను. చిన్న రిపేరన్న మాట. అంతే" అన్నాడు.

నిఖిల్‌కు తల తీసేసినట్లయ్యింది. తన తప్పకు శిక్షలా అనిపించింది. అవమానంగా భావించాడు. అన్నీ వదిలేసి విసురుగా వెళ్లిపోయాడు.

వారం గడిచింది. నిఖిల్ వచ్చాడు. "నన్ను క్షమించరా అఖిల్. ఇక నుండి నీ పుస్తకాలు జాగ్రత్తగా, త్వరగా తిరిగి ఇస్తాలే" అంటూ అఖిల్ చేతులు పట్టుకున్నాడు. తన ప్రయత్నం ఫలించినందుకు అఖిల్ ఆనందించాడు. పుస్తకం మాత్రమే ఇచ్చాడు. ఆ తర్వాత నిఖిల్‌లో కలిగిన మార్పుకు మరెంతో సంతోషించాడు.